

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 05-05-2023 సంపుటి : 04 సంచిక : 219 పేజీలు : 4 వెల : రూ 3-00

## హోంశాఖపై సమీక్ష..

# సీఎం జగన్ కీలక ఆదేశాలు



అమరావతి:సోషల్ మీడియా ద్వారా వేధింపులకు అడ్డుకట్ట పడాలని, దీనిపై ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు.గురువారం ఆయన హోంశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, సచివాలయాల్లో ఉన్న మహిళా పోలీసులకు కచ్చితమైన ప్రోటోకాల్ ఉండాలన్నారు. మహిళా పోలీసులు ప్రస్తుతం నిర్వహిస్తున్న విధులు, చేపడుతున్న బాధ్యతలపై సమగ్ర సమీక్ష చేయాలని, దీనిలో చేయాల్సిన మార్పులు, చేర్పులపై ఆలోచన చేయాలన్నారు"దిశ యాప్ మీద మరోసారి డ్రైవ్ నిర్వహించాలి. ప్రతి ఇంట్లో కూడా ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకున్నారా? లేదా? అన్నదానిపై మరోసారి పరిశీలన చేయాలి. దిశ యాప్ వల్ల జరిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్రతి ఇంటికీ కరపత్రం ఇవ్వాలి. మాదక ద్రవ్యాలను పూర్తిగా నివారించాలి. రవాణా, పంపిణీ, వినియోగంపై పూర్తిస్థాయిలో ఉక్కుపాదం మోపాలి. డ్రగ్ పెడలర్స్ పట్ల మరింత కఠినంగా వ్యవహరించాలి. వీరికి శిక్షలు పెంచేలా ఆలోచన చేయాలి. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో కూడా ఒక దిశ పోలీస్‌స్టేషన్ ఉండాలి" సీఎం ఆదేశాలు జారీ చేశారు.

# మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో హింస





వాహనాలు, ప్రార్థనా స్థలాలకు నిప్పు
రంగంలోకి దిగిన భద్రతా బలగాలి
ఇంటర్నెట్ సేవలు నిలిపివేత
సిఎం బిరేన్ సింగ్‌తో అమిత్ షా చర్చలు



ఇంఫాల్,మే4 : మణిపూర్ రాజధాని నగరం ఇంఫాల్‌లో హింస ప్రజ్వరిల్లింది. అనేక వాహనాలను తగులబెట్టారు, ప్రార్థనా స్థలాలకు నిప్పు పెట్టారు. దీంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు సైన్యాన్ని పిలిచారు. ముఖ్యంగా చురాచాం ద్‌పూర్, ఇంఫాల్ నగరాల్లో హింసా కాండ పెచ్చుమీరింది. ఈ పరిస్థితి గురించి ముఖ్యమంత్రి బిరేన్ సింగ్‌తో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చర్చించారు. మెజారిటీగా ఉన్న మెయిటీలను షెడ్యూల్డు తెగల కేటగిరీలోకి తేవాలనే డిమాండ్‌ను ఎస్టీలు వ్యతిరేకిస్తున్నారు. ఈ నిరసనలకు ది ఆల్ ట్రైబల్ స్టూడెంట్స్ యూనియన్ మణిపూర్ నాయకత్వం వహిస్తోంది. అయితే తమకు సంఘీ భావం తెలుపుతున్న నిరసనకారులే ఈ హింసాకాండకు పాల్పడుతున్నా రనే ఆరోపణలను ఈ సంఘం ఖండించింది. బుధవారం నిర్వహి ంచిన సంఘీభావ ప్రదర్శనలో వేలాది మంది గిరిజనులు పాల్గొన్నా రని, ఈ ప్రదర్శన ప్రశాంతంగా ముగిసిందని తెలిపింది. తమ ప్రదర్శన అనంతరం కొందరు వ్యక్తులు చురాచాంద్‌పూర్‌లోని ఆంగ్లో-కుకీ వార్ మెమోరియల్ గేటుకు నిప్పు పెట్టారని, దీంతో హింస ప్రజ్వరిల్లిందని తెలిపింది. ఈ సంఘం ప్రెసిడెంట్ పావోటింలాంగ్ లుఫెంగ్ మాట్లాడుతూ, ఇంఫాల్, తదితర ప్రాంతాల్లో గిరిజనుల ఇళ్లను, ప్రార్థనా స్థలాలను తగులబెట్టారని తెలిపారు. ఇంత జరుగుతున్నా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని మండిపడ్డారు. ఈ హింసాకాండలో చాలా మంది గాయపడినట్లు, ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోం దన్నారు. పరిస్థితి చాలా ఆందోళన కరంగా ఉందన్నారు.

# చంద్రబాబు నోరు.. రామోజీ రాతలు ఒక్కటే: మంత్రి బొత్స


అమరావతి: భోగాపురం ఎయిర్ పోర్ట్‌కు సీఎం జగన్ శంకుస్థాపన చేయగానే టీడీపీ, రామోజీరావు అక్కసు వెళ్లగక్కారని మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు.గురువారం ఆయన తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రామోజీరావు కడుపుమంటను బయట పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. 12 వేల ఎకరాలు భూసేకరణ చేయాలని ఆనాడు చంద్రబాబు చెప్ప లేదా?. మీ పత్రికల్లో వార్తలు రాయలేదా? అంటూ మంత్రి దుయ్యబట్టారు."అంత అవసరం లేదని ఆరోజు జగన్ చెప్పారు.. కాబట్టే ఇప్పుడు అధికారంలోకి వచ్చాక భూసేకరణను భారీగా తగ్గించేశాం. రైతులను సంతృప్తి చేశాకనే శంకుస్థాపన చేశాం. విభజన చట్టంలోనే భోగాపురం ఎయిర్ పోర్టు గురించి ఉంది. ఆ నిజాన్ని రామోజీరావు ఎందుకు చెప్పటం లేదు?. బాధిత రైతులతో చర్చించాకనే ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టాం. ఉత్తరాంధ్ర అభివృద్ధి జరుగుతుంటే ఎందుకు అంత బాధ?. రాష్ట్ర ప్రయోజనాల కోసం భోగాపురం ఎయిర్ పోర్టు మూలస్తంభంలాగ పని చేస్తోంది. నిన్న జరిగిన శంకుస్థాపన పండుగని చూసి జనం సంతోష పడుతున్నారు. కోర్టులలో రకరకాల కేసులు వేస్తుంటే అన్నిటినీ ఎదుర్కొని ఆటంకాలు లేకుండా చేస్తున్నాం" అని మంత్రి బొత్స పేర్కొన్నారు."తమ రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర అభివృద్ధిని చంద్రబాబు, రామోజీరావు అడ్డుకుంటున్నారు. 12 వేల ఎకరాలు తీసుకోకుండా మేము అడ్డుకున్నాం. 2,300 ఎకరాల్లో నిర్మాణం చేస్తున్నాం. ఒకరిద్దరికి కోర్టు వివాదాల కారణంగా పరిహారం అందలేదు. వారికి కూడా మేము న్యాయం చేస్తున్నాం. చంద్రబాబు చేసినవన్నీ రాజకీయ శంకుస్థాపనలే. జగన్ చేస్తున్న శంకుస్థాపనలు రాష్ట్ర ప్రయోజనాలకే. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగన్ కేసులు వేశారని చంద్రబాబు అంటున్నారు. మరి అప్పుడు చంద్రబాబు గడ్డి పీకుతున్నారా?. ఆరోపణలు చేయగానే సరికాదు. అసలు ఒక మండలం అంతా లేపేయాలని చంద్రబాబు చూశారు. దాంతో జనం భయభ్రాంతులకు గురయ్యారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎయిర్ పోర్టు రావాలని ఇప్పుడు జనం కోరుతున్నారు" అని మంత్రి అన్నారు.



# జగన్ మళ్లీ సీఎం కావడం కోసమే యాగం..

రూ. 10 కోట్ల ఖర్చు, వైసీపీలో 50మంది టికెట్ వద్దన్నారు: మాజీ ఎమ్మెల్యే

విజయవాడలో జరగబోయే రాజశ్యామల యాగంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. మొత్తం రూ.10 కోట్లు ఖర్చు పెడుతున్నారని.. టీటీడీ నుంచి కూడా డబ్బుల్ని ఖర్చు చేస్తున్నట్లు ఆరోపించారు. జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావడం కోసమే ఈ యాగం చేస్తున్నట్లు విమర్శించారు. సిట్ పేరుతో హడావిడి తప్ప ఏమీ లేదని.. ఈ నాలుగేళ్లలో ఏం చేయగలిగారని ప్రశ్నించారు. 50మంది ఎమ్మెల్యేలు టికెట్ వద్దంటున్నారని.. రీజినల్ కో ఆర్డినేటర్లది కూడా అదే పరిస్థితి ఉందన్నారు.జగన్ మరోసారి సీఎం కావడం కోసం విజయవాడలో రాజశ్యామల యాగం చేస్తున్నారన్నారు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమా. దేవాలయాల సొమ్ములకు సీఎం పరిరక్షకుడు మాత్రమేనని.. దేవుడి సొమ్ముతో ఆర్భాటాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రసిద్ధ దేవాలయాల సొమ్ము రూ.10 కోట్లతో ఈ యాగం చేస్తున్నారని.. ఈ చర్యతో హిందువుల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. ఈ యాగానికి టీటీడీ నుంచి 2.5 కోట్లు ఖర్చు చేస్తున్నారని.. వెంటనే ఆ పదికోట్లు ఆయా దేవాలయాలకి తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.శారదా పీఠాధిపతిని పక్కన పెట్టి లాబీయిష్టు, రెండో కృష్ణుడు విజయకుమార్ ఆధ్వర్యంలో ఈ యాగం చేస్తున్నారన్నారు. హిందూ దేవాలయాలపై జగన్ సీఎం అయ్యాక అనేక దాడులు జరిగాయని.. ఆ దాడులపై ఎలాంటి కేసులు పెట్టలేదన్నారు. సంక్రాంతి, ఉగాది వేడుకలు చేస్తే పోలీసులతో కేసులు పెట్టారని.. ఆ తప్పుడు కేసుల విషయంలో ఛార్జి షీటు కూడా వేయలేకపోయారని విమర్శించారు.



నాలుగేళ్లు అయినా ఒక్క అవినీతి అయినా బయటపెట్టగలిగారా.. వైఎస్సార్‌సీపీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు.రేపో ఎల్లుండో ఎంపీ అవినాష్ రెడ్డి అరెస్ట్ ఖాయమని.. వైఎస్సార్‌సీపీలో 50 మంది ఎమ్మెల్యేలు సీట్లు వద్దంటున్నారన్నారు. ఎమ్మెల్యే లు పారిపోతున్నారని.. సమన్వయకర్తలు కాడి పడేస్తున్నారన్నారు. జగన్ నేలమాలిగల్లో దాచిన డబ్బుని బయటికి తీసి మళ్ళీ ముఖ్యమంత్రి అవ్వాలని చూస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# పోలీస్ సిబ్బందికి వైద్య శిబిరం

ఉచితంగా పలు పరీక్షల నిర్వహణ

అమరావతి,మే4:రాష్ట్ర సచివాలయంలో ఎస్పీఎఫ్ పోలీసులకు వైద్య శిబిరం నిర్వహించారు. సెక్రటేరియట్లో పనిచేస్తున్న ఎస్.పి.ఎఫ్. సిబ్బంది,అధికారులకు గురువారం ఎస్.పి.ఎఫ్ ఆఫీస్ ఆవరణలో విజయవాడ రమేష్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహినీచడం జరిగింది.ఎస్. పి. ఎఫ్. డి.జి. హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలు మేరకు ఎస్.పి.ఎఫ్. డి.ఐ.జి. బి.వి.రామి రెడ్డి సలహాల మేరకు ఈ వైద్య శిబిరము జరిగిందని చీఫ్ సెక్యూరిటీ అధికారి కె.కృష్ణమూర్తి తెలిపారు. ఈ వైద్య శిబిరములో 222 ఎస్.పి.ఎఫ్. అధికారులు, సిబ్బందికి గుండె, షుగర్, బి.పి. ఇతర వైద్య పరిక్షలు నిర్వహినీచడం జరిగిందని చెప్పారు. ఇందులో భాగముగా ఇ.సి.జి. పరిక్ష నిర్వహినీచడం జరిగిందని పేర్కొన్నారు.అంతకు ముందు సిబ్బందిని ఉద్దేశించి ఆర్యోగ్యము పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు సలహాలను రమేష్ హాస్పిటల్ డాక్టర్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సెక్యూరిటీ అధికారి కృష్ణమూర్తి తోపాటు ఇన్స్పెక్టర్లు వి.ఎస్..నారాయణ,ఎ.సతీష్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్స్ ,సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరి జిల్లాల్లో బాబు పర్యటన



ఏలూరు, మే 4,రాష్ట్రంలో రైతుల పరిస్థితి అతలాకుతలం అయినప్పటికీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతులను, ప్రతిపక్షాలను వేధిస్తున్నారని మాజీ మంత్రి కేఎస్ జవహార్ మండిపడ్డారు. రాజమండ్రిలో మీడియాతో మాట్లాడిన ఆయన నష్టపోయిన రైతుల ఇబ్బందులు తెలుసుకుని వారి పక్షాన పోరాటం చేసేందుకు చంద్రబాబు ఉభయగోదావరి జిల్లాలో పర్యటిస్తున్నారని తెలిపారు. అకాల వర్షానికి నష్టపోయిన రైతుల కష్టాలు తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నేడు, రేపు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పర్యటించనున్నారు. ఇప్పటికే పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లి గూడెం ప్రాంతాల్లో పర్యటిస్తుండగా సాయంత్రం వరకు నిడమర్రులోని నష్టపోయిన వరిపొలాలను పరిశీలిస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా సాయంత్రం 5 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాలు వద్దకు చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. శుక్రవారం ఉదయం పది గంటలకు ప్రారంభమై వేగియమ్మపేటలో నష్టపోయిన పంటపొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడతారు. అక్కడినుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు కడియం మండలం చేరుకుని అక్కడ పంట నష్టాన్ని పరిశీలించి అక్కడి నుంచి నేరుగా రాజమండ్రి చేరుకుంటారు. రాజమండ్రిలో సెంట్రల్ జైలో ఉన్నటువంటి ఆదిరెడ్డి అప్పారావు, వాసులను కలుసుకుని అక్కడి నుంచి ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించి అక్కడినుంచి ఎయిర్‌పోర్ట్ కు వెళతారు. ఫ్లైట్‌లో హైదరాబాద్ వెళతారు. ఆదిరెడ్డి వాసు, అప్పారావును కలిసేందుకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తే ములాఖత్‌లో రేషన్ పెట్టి ఇద్దరే కలవాలి అంటూ ఆంక్షలు పెట్టిస్తున్నారని మండిపడ్డారు జవహర్. తాను జైలు సూపరెంటెండ్‌ను కలవాలని వ్యక్తిగతంగా వెళ్తే అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని ఆరోపించారు. దీన్ని బట్టి అధికారులు ఎంతగా భయపడుతున్నారో అర్థమవుతుందన్నారు. రాజమండ్రిలోని ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ కుటుంబాన్ని, జైలులో ఉన్న ఆదిరెడ్డి అప్పారావు, వాసును కలుసుకునేందుకు సాయంత్రం నాలుగు గంటలకు సెంట్రల్ జైలు వద్దకు చంద్రబాబు రాబోతున్నారని తెలిపారు జవహర్. వారిని కలవనీయకుండా ఉ ంచేందుకు సీఐడీ పోలీసులు వారిని కస్టడీకి ఇవ్వాలని కోరుతున్నారని ఆరోపించారు. ఆదిరెడ్డి కుటుంబాన్ని ఎంతగా వేధించాలో అంతగా వేధిస్తున్నారని మండిపడ్డారు. నష్టం జరిగిన కుటుంబాన్ని నాయకుడు పరామర్శించాలంటే వీల్లేకుండా చేస్తున్నారి వాపోయారు. జైల్లో ఉన్న వారిని చంద్రబాబు కలవకుండా చేందుకు ప్లాన్ చేస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగ యువత కోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన దాఖలాలు లేవని అన్నారు జవహర్. గ్రూప్స్ కానీ, డీఎస్సీ కానీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా నిరుద్యోగులను దగా చేస్తున్నారన్నారు. రైతులు దయనీయ పరిస్థితిలో ఉంటే రైతులను ఆదుకున్న పరిస్థితి లేదన్నారు.

# ఏపీ భవన్ విభజనపై కేంద్ర హోంశాఖ కొత్త ప్రతిపాదన

ఢిల్లీ: ఏపీ భవన్ విభజనపై కేంద్ర హోంశాఖ కొత్త ప్రతిపాదన చేసింది. గత సమావేశం మినిట్స్‌ను కేంద్ర హోంశాఖ విడుదల చేసింది.పటోడి హౌస్ 7.64 ఎకరాల స్థలాన్ని తెలంగాణకు.. శబరి బ్లాకు, గోదావరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్ బ్లాక్‌లకు సంబంధించి 12.09 ఎకరాలు ఏపీకి ఇవ్వాలని ప్రతిపాదించింది.ఈ ప్రతిపాదనతో ఏపీ, తెలంగాణ జనాభా నిష్పత్తికి అనుగుణంగా రెండు రాష్ట్రాలకు వాటా దక్కుతుంది. కేంద్ర ప్రతిపాదన ఆచరణ యోగ్యంగా ఉందన్న ఏపీ ప్రభుత్వం.. మూడు ఆప్షన్లను పరిశీలించి తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకోనుంది.



# డిఫెన్స్ కి సివిల్ కి తేడా తెలియని వ్యక్తి సిఎం జగన్

-మాజీ మంత్రి గంటా శ్రీనివాస్ రావు



విశాఖపట్నం డిఫెన్స్ కి సివిల్ కి తేడా తెలియని వ్యక్తి సిఎం జగన్ అని మాజీ మంత్రి,టిడిపి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ రావు అన్నారు.భోగాపురం ఎయిర్పోర్ట్, ఆధాని డేటా సెంటర్లకు సీఎం జగన్ మళ్ళీ శంఖుస్థాపన చెయ్యటం సిగ్గుచేటని అన్నారు.అధికారంలోకి వచ్చిన 4 ఏళ్ల తర్వాత రాజకీయ లబ్ధి కోసం శంఖుస్థాపన చేశారని,ప్రతిపక్షంలో జగన్ మాట్లాడిన మాటలకు అధికారంలో మాటలకు పొంతన లేదని ఎద్దేవా చేశారు.డిఫెన్స్, సివిల్ కి తేడా జగన్ కి తెలుసా అని ప్రశ్నించారు.ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి కి కనీస అవగాహన లేదని చెప్పారు.పెట్టుబడుల సదస్సు జరిగి రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు రివ్యూ కూడ నిర్వహించలేని పరిస్థితి లో వైసీపీ ప్రభుత్వం ఉందని మండిపడ్డారు.ఉత్తరాంధ్ర అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేసే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు.

# సంపాదకీయం

శుక్రవారం 05-05-2023

## చాట్ జీపీటీకి చెక్ పెట్టాలా

సుమారు 19,000 మంది టెక్ దిగ్గజాలు కృత్రిమ మేధ 'జనరేటివ్ ఏఐ'పై ఆందోళన వెలిబుచ్చుతూ బహిరంగ లేఖ రాశారు. జీపీటీ4 లాంటి టెక్నాలజీలను కనీసం ఆరు నెలల పాటు నిలిపేయాలని కోరారు. మనం చాలా టెక్నాలజీల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాం. మానవ క్లోనింగ్, జన్యుమార్పిడి, అణు టెక్నాలజీలు వీటిల్లో కొన్ని మాత్రమే. కానీ ఈ నిలిపివేత వల్ల ప్రపంచం మొత్తానికి దాదాపుగా ఉచితంగా, అది కూడా పర్యావరణ కాలుష్యం లేకుండా అందివ్వగల కేంద్రక సంలీన ప్రక్రియను సాకారం చేసే జీపీటీ7, జీపీటీ8 వంటి అత్యాధునిక జనరేటివ్ ఏఐ మోడళ్లు రావడం ఆలస్యం కాదా? అత్యద్భుత మేధతో మాత్రమే పరిష్కారం కాగల పెద్ద పెద్ద సమస్యల మాటేమిటి? అందుకే దీనిమీద గట్టి చర్చ జరగాలి.ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఫిలాసఫర్ నిక్ బోస్ట్రోమ్ 'సూపర్ ఇంటెలిజెన్స్' పేరుతో ఓ పుస్తకం రాశారు. అదొక బెస్ట్ సెల్లర్. అననుకూల వాతావరణంలో మనుగడ కష్టమై బెదిరిపోయిన పిచ్చుకల గుంపు కథ ఇందులో ఉంది. సమస్యలను అధిగమించేందుకు ఆ పిచ్చుకల గుంపు ఓ గుడ్లగూబను దత్తత తీసుకోవాలని నిర్ణయిస్తుంది. ఆ గుడ్లగూబ తమ గూళ్లు కట్టి పెడుతుందనీ, వేటాడేందుకు వచ్చిన జంతువులను భయపెట్టి తరిమే స్తుందనీ, ఆహారాన్ని వెతుక్కునేందుకు సాయపడుతుందనీ ఆ పిచ్చు కలు భావిస్తాయి.ఇదేదో భలే ఉందే అనుకున్న పిచ్చుకల గుంపు గుడ్లగూబ లేదా దాని గుడ్డు వెతకాలని నిర్ణయించుకుంటాయి. అయితే గుంపులో స్క్రాన్ ఫింకెల్ అనే పిచ్చుక ఈ ఆలోచనతో అంగీ కరించదు. గుంపులో గుడ్లగూబ ఉంటే సమస్యలు తప్పవనీ, అందుకే ముందు ఆ గుడ్లగూబను నియంత్రించడమెలా, మచ్చిక చేసుకోవడం ఎలా అన్నది ఆలోచించాలనీ ప్రతిపాదిస్తుంది. మిగిలిన పిచ్చుకలు ఈ అభ్యంతరాలను పట్టించుకోవు. గుడ్లగూబను వెతికి తెచ్చుకోవడమే పెద్ద విషయమనీ, మచ్చిక, నియంత్రణలను ఆ తరువాత చూసు కోవచ్చుననీ అంటాయి. ఇప్పటివరకూ కనీసం 19,000 స్క్రాన్ ఫింకెల్స్ అభ్యంతరాలు వ్యక్తం చేశాయి... ఈ మధ్యకాలంలో అందరినీ ఆశ్చర్యానికి గురిచేసిన ఛాట్ జీపీటీపై! టెక్నాలజీ రంగ దిగ్గజాలు ఎలాన్ మస్క్, స్టీవ్ వోజ్నియాక్, స్టువర్ట్ రస్సెల్ వంటి మరెందరో కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే ఈ జీపీటీ4పై, స్థూలంగా 'జనరేటివ్ ఏఐ'పై తమ ఆందోళన వెలి బుచ్చారు. అక్కడితో ఆగలేదు. ఫ్యూచర్ ఆఫ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'పవర్‌ఫుల్ ఏ.ఐ. సిస్టమ్స్' పేరుతో ఓ బహిరంగ లేఖ కూడా రాశారు.అన్ని సానుకూల ఫలితాలుంటాయనీ, ఎదురయ్యే ప్రమాదాలను నియంత్రించేందుకు అవకాశముంటుందన్న నమ్మకం కుదిరిన తరువాత మాత్రమే జీపీటీ4 లాంటి టెక్నాలజీలను మరింత అభివృద్ధి చేయాలనీ వారు ఈ లేఖలో స్పష్టం చేశారు. జీపీటీ4ను అభివృద్ధి చేస్తున్న సంస్థ 'ఓపెన్ ఏఐ' స్వయంగా "ఏదో ఒకదశలో దీనిపై స్వతంత్ర సమీక్ష ఒకటి జరపడం చాలా ముఖ్యమవుతుంది. జీపీటీ4 లాంటి వ్యవస్థలకు మరింత శిక్షణ ఇచ్చే ముందు ఇది జరగాలి.అలాగే ఇలాంటి వ్యవస్థల కోసం ఉపయోగించే గరిష్ఠ కంప్యూటింగ్ శక్తిని కూడా మదింపు చేయాలి" అని చెప్పడాన్ని వీరు తమ లేఖలో ఉదహరించారు. ఆ సమయం ఇప్పుడు ఆసన్నమైందన్నది టెక్ దిగ్గజాల అంచనా. ఈ విషయమై కృత్రిమ మేధపై పని చేస్తున్న అన్ని కంపెనీలకు ఒక విజ్ఞప్తి కూడా చేశారు. జీపీటీ4 కంటే ఎక్కువ శక్తిమంతమైన అన్ని కృత్రిమ మేధ వ్యవస్థలకు శిక్షణ ఇవ్వ డాన్ని కనీసం ఆరునెలలు ఆపాలనీ, అది వెంటనే జరగాలనీ కోరారు. అలా సాధ్యం కాని పక్షంలో ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని కూడా సూచించారు ఐఫోన్ , ఫేస్‌బుక్, టిక్‌టోక్‌లు అందుబాటులోకి వచ్చినప్పుడు కూడా వాటితోనూ కొన్ని దుష్ప్రభావాలు ఉండగలవని ఎవరు ఊహించారు?ఆచితూచి వ్యవహరించాల్సిన టెక్నాలజీలు జీపీటీ4 లాంటి జనరేటివ్ ఏఐ టెక్నాలజీ అతితక్కువ సమయంలో అత్యద్భుతమైన ఫలితాలను ఎలా ప్రదర్శిస్తోందో టెక్ కంపెనీలకు సైతం ఇంకా తెలియకపోవడం గమనార్హం. "కొంచెం జాగ్ర త్తగా ఉండక తప్పదు. దీని (ఏఐ) గురించి మనమూ భయపడు తున్నామని తెలిస్తే ప్రజలు కొంత సంతోషంగా ఫీల్ అవుతారు" అంటారు 'ఓపెన్ ఏఐ' సీఈవో సామ్ ఆల్ట్‌మ్యాన్ . ఇదేదో అమాయ కమైన చిన్న పిచ్చుక లాంటి వ్యవహారం కాదు, ప్రమాదకరమైనది అని ఆయన స్పష్టంగా హెచ్చరించారు. టెక్ దిగ్గజాలు రాసిన బహిరంగ లేఖలో ఒక్క విషయాన్నయితే అంగీకరించాల్సి ఉంటుంది. ఇటీవలి కాలంలో మనం చాలా టెక్నా లజీల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాం. కొన్నింటి పురోగతిని నిలిపివేసే ప్రయత్నమూ చేశాం. మానవ క్లోనింగ్, జన్యుమార్పిడి టెక్నాలజీలు వీటిల్లో కొన్ని మాత్రమే. భూమండలాన్ని ధ్వంసం చేసే సామర్థ్యమున్న రసాయన, జీవాయుధాలు, అణ్వస్త్ర టెక్నాలజీలను కూడా అడ్డుకున్నాం. అణ్వస్త్ర టెక్నాలజీనే తీసుకుంటే... శక్తిమంతమైన కృత్రిమ మేధలాగే, అణువును విభజించడంలో లాభాలెన్నో, నష్టాలూ అన్నే.అనంతమైన విద్యుత్తు ఇవ్వగలగడం సానుకూల అంశమైతే, విధ్వంసం దీనికి మరోవైపున కనిపిస్తుంది. ఈ రెండో రూపాన్ని గుర్తించేందుకు హిరోషిమా, నాగసాకి వంటి భయంకరమైన అణుబాంబు దాడుల్ని చూడాల్సి వచ్చింది. ఈ ఘటన తరువాత దేశాలన్నీ ఒక్కతాటిపై వచ్చి ఇంటర్నేషనల్ అటామిక్ ఏజెన్సీ, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టం వంటి వాటిద్వారా అణ్వస్త్రాలపై నిషేధం, నియంత్రణలు తేగలిగాయి. తద్వారా మరిన్ని హిరోషిమా, నాగ సాకీలు జరక్కుండా ఇప్పటివరకూ నిరోధించగలిగాం. అణు టెక్నాలజీకి సంబంధించిన ఇంకో పార్శ్వమూ ఉంది. విధ్వంసం, వినాశనాలకు బెదిరి మనం వాడకాన్ని మరీ పరిమితం చేసేశాం. ఫలితంగా వాతావరణ మార్పులకు కారణమైన శిలాజ ఇంధనాలను విపరీతంగా వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక ముప్పు తప్పించుకునేందుకు ఇంకోముప్పును కొని తెచ్చుకున్నట్టు అన్నమాట!కృత్రిమ మేధ టెక్నాలజీపై ఆరు నెలల విరామం వల్ల ఏం ఫలితం ఉండగలదని చాలామంది ప్రశ్నించవచ్చు. ఒక వేళ ఆరునెలల పాటు నిలిపేసినా చైనా లాంటి దేశాలు దీన్ని అనుసరిస్తాయా? తాత్కాలిక నిలిపివేత వల్ల ప్రపంచం మొత్తానికి దాదాపుగా ఉచితంగా, అది కూడా పర్యావరణ కాలుష్యం అనేది లేకుండా అందివ్వ గల కేంద్రక సంలీన ప్రక్రియను సాకారం చేసే శక్తి ఉన్న జీపీటీ7, జీపీటీ8 వంటి అత్యాధునిక జనరేటివ్ ఏఐ మోడళ్లు రావడం ఆలస్యం కాదా? వాతావరణ మార్పులు మొదలుకొని అత్యద్భుత మేధతో మాత్రమే పరిష్కారం కాగల పెద్ద పెద్ద సమస్యల మాటేమిటి? ఈ ప్రశ్నలపై చర్చోపచర్చలు దీర్ఘకాలం కొనసాగుతాయిఅందులో సందేహం లేదు.


# మహానాడులో క్లారిటీ వచ్చేనా

విజయవాడ, మే 4, ఏపీలో సాధారణ ఎన్నికలకు సరిగ్గా ఏడాది కూడా లేదు. దీంతో అన్ని రాజకీయ పార్టీలు దూకుడు పెంచాయి. అధికార వైసీపీ ఒంటరిగా వెళ్లేందుకు నిర్ణయించుకోగా. తెలుగుదేశం జనసేన కలిసి నడుస్తాయని వార్తలు వస్తున్నాయి. అందుకు తగ్గట్టుగానే ఆ రెండు పార్టీల మధ్య సానుకూల వాతావరణం ఉంది. ఇటీవలే చంద్రబాబు, పవన్‌లు భేటీ అయ్యారు. ఏపీలో బీజేపీ, జనసేనతో పాటుగా టీడీపీతోనూ కలిసి వెళ్లేలా ప్రతిపాదన చేసారు. 2014 ఎన్నికల తరహాలో పొత్తుల ద్వారా వైసీపీ వ్యతిరేక ఓటు చీలకుండా, అదే సమయంలో మూడు పార్టీలకు మేలు జరిగేలా కార్యచరణ వివరించారు. దీని పైన బీజేపీ నుంచి స్పష్టత రాలేదని సమాచారం. పవన్ ఢిల్లీలో కేంద్ర బీజేపీ నేతలతో ఇటీవలే జరిపిన చర్చల సారాంశం తో పాటు, భవిష్యత్ ప్రణాళికపైనా చర్చలు చేసారు. పొత్తుల అంశంపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం. అయితే ఈ విషయంలో బీజేపీ కాస్త భిన్నంగా ఉంది. బీజేపీని తమతో తీసుకెళ్లాలని చంద్రబాబు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నారు. అటు పవన్ సైతం అటువంటి ప్రయత్నమే చేశారు. కానీ ఇరువురు నేతల ప్రయత్నాలు కొలిక్కి రాలేదు. దీంతో తాజా భేటీపై పలు ఊహాగానాలు, విశ్లేషణలతో రాజకీయ వర్గం తలమునకలౌతోంది.పొత్తుపై బీజేపీ నిర్ణయం కోసం ఎదురుచూడటం, దాని పరిణామాలు బట్టి నిర్ణయం తీసుకుందామని ఇరువురి నేతల ఆలోచనగా తెలుస్తోంది. అయితే టీడీపీతో కలిసి వెళ్లే క్రమంలో బీజేపీలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. టీడీపీ అనుకూల పక్షమైన కొందరు నేతలు స్వాగతిస్తున్నారు. కానీ గత అనుభవాల దృష్ట్యా చంద్రబాబుతో వెళ్లేందుకు మెజార్టీ కేడర్ నిరాకరిస్తోంది. కానీ ఒకరిద్దరు నాయకులు మీడియా ముందుకొచ్చి మాట్లాడడం ప్రాధాన్యతను సంతరించుకుంది.టీడీపీతో కలిసి వెళ్ళేందుకు బీజేపీలో కీలక నేతలు సుముఖంగా వున్నా అధినాయకత్వం ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. కర్ణాటక ఎన్నికల తర్వాత ఈ విషయంపై స్పష్టత రావచ్చు. ఏపీలో బీజేపీ, జనసేనతో పాటుగా టీడీపీతోనూ కలిసి వెళ్లేలా ప్రతిపాదన చేసారు. 2014 ఎన్నికల తరహాలో పొత్తుల ద్వారా వైసీపీ వ్యతిరేక ఓటు చీలకుండా, అదే సమయంలో మూడు పార్టీలకు మేలు జరిగేలా కార్యాచరణ వివరించారు. దీని పైన బీజేపీ నుంచి స్పష్టత రాలేదని సమాచారం. ఇప్పుడు ఢిల్లీ చర్చల సారాంశం భవిష్యత్ ప్రణాళికపైనా పవన్ కల్యాణ్ చంద్రబాబుతో చర్చించారు. సీట్ల విషయంలో తెలుగుదేశం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఆ విషయం తేల్చుకునేందుకే పవన్ కళ్యాణ్ స్వయంగా చంద్రబాబు వద్దకు వెళ్లారు అని కొందరు అంటున్నారు. పవన్ కళ్యాణ్ 32 అసెంబ్లీ సీట్లు కోరుతున్నట్లు తెలుస్తోంది ఆయా ప్రాంతాలలోని సామాజిక సమీకరణాలను దృష్టిలో వుంచుకొని ఉభయ గోదావరి జిల్లాలతో పాటు విశాఖ జిల్లాల్లో తమకు ఎక్కువ సీట్లు కావాలని పవన్ డిమాండ్ చేస్తున్నారని ఒక 25 దాకా గెలిస్తే రేపటి ఎన్నికల తర్వాత ఏర్పడే ప్రభుత్వంలో తమ ప్రభావం గట్టిగా ఉంటుందని పవన్ ఆలోచన . జనసేనకు తెలుగుదేశం పార్టీ ఇచ్చే సీట్ల విషయంలో సీరియస్ గానే చర్చ సాగినట్లు తెలుస్తోంది. నిజానికి పొత్తులు ఏనాడో కుదిరాయి. సీట్ల వద్దనే పంచాయతీ తేలడం లేదు. కర్ణాటక ఎన్నికల తర్వాత బీజేపీ బలంపైన ఆ పార్టీ నేతలు ఒక అంచనాకు వస్తారని, ఆ తర్వాత పొత్తుల విషయంలో సానుకూలత రావచ్చని ఈ ఇద్దరు నేతల అభిప్రాయం ఇటు క్షేత్ర స్థాయిలో చేయించిన సర్వేలతో పాటుగా ప్రధాన ఓటు బ్యాంకుగా భావిస్తున్న వర్గాలను తమ వైపు తిప్పుకోవటం కోసం కొత్త వ్యూహాలు అమలు చేయాలని నిర్ణయించారు. బీజేపీ కలిసి వస్తే మూడు పార్టీల పొత్తు, లేకుంటే టీడీపీ-జనసేన పొత్తుతో పాటుగా పవన్ కల్యాణ్ వారాహి యాత్రపై పార్టీ తెలుగుదేశం మహానాడులో పొత్తుల పైన ప్రకటన రావచ్చు.రాజకీయాల్లో శాశ్వత మిత్రులు శత్రువులు ఉండరు అంటారు. చంద్రబాబు ఈ సూత్రాన్ని నూటికి నూరు శాతం అనుసరిస్తారు. ఆయనకు నచ్చకపోతే దూరం జరుగుతారు. నచ్చితే మళ్లీ దగ్గర చేరేందుకు ఆరాటపడతారు. టీడీపీని తన చేతుల్లోకి తీసుకున్నాక చంద్రబాబు మార్క్ రాజకీయ విన్యాసం అందరికీ తెలిసిందే. దేశాభివృద్ధి కోసం తెలుగు ప్రజల కోసం తన పరిధిలో తాను పనిచేస్తున్నానని, ప్రధాని విజన్‌తో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని . ప్రధాని ఆలోచనలకు అనుగుణంగా తన పరిధి మేరకు కలిసి పనిచేయడానికి సిద్ధమని, భారతదేశ బలమేమిటో.. ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచానికి చాటి చెబుతున్నారని చంద్రబాబు తాజాగా వ్యాఖ్యానించారు. తాను మోదీ పాలసీలను వ్యతిరేకించలేదని, ప్రత్యేక హోదా సెంటిమెంట్ గా మారిందని, దాని మీద మాత్రమే తాను అప్పట్లో పోరాడానని చంద్రబాబు వివరించడం గమనార్హం. బీజేపీతో బాహాటంగా జట్టు కట్టడానికి తన వైపు నుంచి ఆయన సంకేతాలు పంపినట్లుగానే భావించవచ్చని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.భారతీయ జనతా పార్టీ చంద్రబాబు వ్యాఖ్యలపై ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు కీలకం కావొచ్చు. ఎందుకంటే టీడీపీతో పొత్తులో ఉంటే నేరుగా ఎన్డీఏలో కూటమిలో దాన్ని కలుపుకోవచ్చు. వైఎస్ఆర్‌సీపీతో అలాంటి అవకాశం ఉండదు. తన పార్టీకి పూర్వ వైభవం తెప్పించుకునేందుకు కష్టపడుతున్నారు చంద్రబాబు. వైసీపీతో మాత్రం తెగించి పోరాడుతున్నారు. విజయం లభిస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. అలా జరగాలంటే బీజేపీ మద్దతు ముఖ్యమనుకుంటున్నారు. అందుకే చంద్రబాబు బీజేపీ విషయంలో సానుకూలంగా ఉన్నారు, కానీ రాష్ట్ర స్థాయిలో బీజేపీ నాయకులు టీడీపీతో పొత్తు కు సుముఖంగా లేరు. అలాగని జనసేనతో కూడ అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు.త్వరలోనే ఏపీలో భారీగా చేరికలు ఉంటాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీల నుంచి కూడా పెద్దఎత్తున నేతలు.. బీజేపీలో చేరుతారంటూ రాజమండ్రి బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు గమనార్హం. రాష్ట్రంలో వైసీపీని గద్దె దించి బీజేపీ-జనసేన కూటమి అధికారం చేపట్టాలన్నదే తమ లక్ష్యమని, నిజానికి తెలుగుదేశం పార్టీ కంటే కూడా అసలైన ప్రతిపక్ష పాత్రను తామే పోషిస్తామని బీజేపీ నేతలు చెబుతున్నారు. కానీ బీజేపీతో పొత్తు కోరుకుంటూనే.. మరోవైపు తమ పార్టీకి చెందిన ముఖ్య నేతలను టీడీపీ లాక్కుంటోందని బీజేపీ ఆరోపణ.బీజేపీ-జనసేన కూటమిగా ఎన్నికలకు వెళతాయని ఓ పక్క ప్రకటిస్తూ కాంగ్రెస్ నాయకులని తమ వైపు తిప్పుకుని గ్రామీణ ప్రాంతంలో ఉన్న కాంగ్రెస్ ఓటు బ్యాంకును తమ ఖాతాలో కలుపుకుంటే కొద్దో గొప్పో సీట్లను దక్కించుకోవచ్చు అన్నది బీజేపీ రాష్ట్ర నేతల వ్యూహం. ఇటీవలే బీజేపీలో చేరిన కిరణ్ కుమార్ రెడ్డి ద్వారా మరికొందరు కాంగ్రెస్ సీనియర్ నేతలు పార్టీలోకి చేరతారా అన్నది కర్ణాటక ఫలితాల తర్వాత తేలనుంది. అదే సమయంలో బీజేపీతో పొత్తు పెట్టుకుంటే ముస్లింలు ఈసారి టీడీపీకి మద్దతిస్తారా లేదా అన్న చర్చ కూడా సాగుతోంది. లోకేష్ పాదయాత్రలో భాగంగా యువతకు, మహిళలకు అవకాశాలు కల్పిస్తాం అంటూ ఇస్తున్న హామీలు తెలుగుదేశం శ్రేణులలో జోష్‌ని నింపాయి. అయితే తెలుగుదేశం పార్టీ సీనియర్లు ఇంకా వర్గ విభేదాలతో రాజకీయం చేస్తూ అధినేతకు తలనొప్పిగా మారారు.వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి వచ్చే నాయకులను పార్టీలో టిక్కెట్లు ఆశించే ఆశావహులను సమన్వయం చేయడం కోసం చంద్రబాబు వ్యూహరచన చేస్తున్నారు దీనికి గాను పార్టీ సీనియర్లతో ఓ కమిటీని ఏర్పాటు చేసి సమీక్షిస్తున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

## భీమవరం మున్సిపాల్టీల్లో వాకీ టాకీలు

ఏలూరు, మే 4, భీమవరం మున్సిపాలిటీ పరిధిలో సిబ్బందికి త్వరలో వాకీటాకీలు అందుబాటులోకి రానున్నాయి. పాలన పరంగా, మౌలిక వసతులైన తాగునీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, ఇతర ఏ సమస్య ఉన్నా వేగంగా అధికారులు, సిబ్బంది స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించడమే లక్ష్యంగా వీటిని వినియోగించనున్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి, స్థానిక ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సూచన మేరకు మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ నిర్ణయం తీసుకున్నారు. మున్సిపాలిటీకి 80 వాకీటాకీల కోసం రూ.25 లక్షల నిధుల మంజూరు కోసం ప్రతిపాదించారు.భీమవరం మున్సిపాలిటీ పరిధిలో 46 సచివాలయాలు ఉన్నాయి. వాటికి ఒక్కొక్కటి చొప్పున వాకీటాకీలు అందిస్తారు. ఆయా వార్డుల పరిధిలో తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యలను ప్రజలు సచివాలయ సిబ్బందికి గాని, అధికారులకు నేరుగా గాని తెలియజేసినప్పుడు ఆ సమస్య సత్వర పరిష్కారం కోసం సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు వాకీటాకీలను ఉపయోగిస్తారు. ఏదైనా అగ్నిప్రమాదం, తుపానులు, వరదల సమయంలో ప్రజలకు అత్యవసర సేవలు అందించాల్సిన సమయాల్లో ఉన్నతాధికారులకు వాకీటాకీ ద్వారా సచివాలయ సిబ్బంది సమాచారం తెలియజేసి సాయం అందేలా చేయడానికి వీటిని వినియోగిస్తారు.తద్వారా ఉన్నతాధికారులు సత్వర ఆదేశాలు జారీ చేయడానికి ఇవి ఉపకరిస్తాయి. మున్సిపల్ కమిషనర్, సెక్షన్ ముఖ్య అధికారులు ప్రతిరోజూ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ఎప్పటికప్పుడు ప్రజలకు అందించడంలో వారిని అప్రమత్తం చేయడానికి, పాలన పరంగా సేవలు వేగవంతం చేయడానికి సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఉపయోగపడతాయి. ఏదైనా సమాచారం అందరికీ ఒకేసారి చేరడం ఇందులో ప్రధాన సౌలభ్యం. సచివాలయాల్లో విధుల్లో ఉండే ఇమ్యూనిటీ సెక్రటరీలు, హెల్త్ సెక్రటరీలు, ఇతర సిబ్బంది వీటిని వినియోగించేందుకు అవకాశముంటుంది. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే వద్ద కూడా వాకీటాకీలు ఉండటం వల్ల సమస్య వెంటనే వారి దృష్టికి వెళుతుంది. వాకీటాకీల వ్యవస్థ నూతన పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరం మున్సిపాలిటీ తొలిసారిగా వినియోగించనుంది. 20 ఏళ్ల క్రితం ఇదే మున్సిపాలిటీ వాకీటాకీలను ఉపయోగించినట్టు అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు టెక్నాలజీ పెరగడం, సిబ్బంది పుష్కలంగా అందుబాటులో ఉండటంతో వీటి ద్వారా మంచి ఫలితాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. భీమవరం పట్టణంలో అత్యంత ఎత్తులో ఉండే బీఎస్ఎన్ఎల్ లేదా ప్రైవేట్ టవర్లకు అనుసంధానం చేసి నిరంతరం సిగ్నల్స్ ఇబ్బంది లేకుండా వాకీటాకీలు పనిచేసేలా చర్యలు తీసుకుంటారు.

## సాదా, సీదాగా... చిక్కాల



కాకినాడ, మే 4, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఆయన సొంతం. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. రెండు సార్లు మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్సీగా పనిచేశారు. ఎప్పుడూ ప్రజల మధ్యనే ఉంటూ సామాన్యుడిగా వ్యవహరించారు. ఆయనే మాజీ మంత్రి, ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు. సోమవారంతో శాసన మండలి సభ్యత్వ కాలం ముగిసింది. ఈ సందర్భంగా ఆయనను దిశ పలకరించింది. అందరితో కలుపుగోలుగా ఉంటానని, పనిచేసినంత కాలం రాజకీయాల్లో నిజాయితీగా వ్యవహరించానని చెబుతూ తన మనోగతాన్ని ఆవిష్కరించారు.రామచంద్రపురం వి.ఎస్.ఎం కళాశాలలో బీకాం పూర్తి చేశాను. మంచి మార్కులే వచ్చాయి. అటవీ శాఖలో పారెస్టర్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోగా, సెలెక్ట్ అయ్యా. అయితే ఉద్యోగం మాత్రం రాలేదు. చివరి నిమిషంలో వేరే వ్యక్తికి వెళ్ళిపోయింది. అతనికి మంత్రి రికమండేషన్ ఉందని చెప్పారు. ఆ విషయాన్ని అంతగా పట్టించుకోలేదు. నాడు కేంద్ర ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టింది. దానికి అప్లై చేయగా రూ.15000 రుణం మంజూరైంది. పది గేదెలను కొని గొల్లపాలెం లో ఉన్న మా మేనత్త కిష్టమ్మ ఇంటి ఆవరణలో ఫారం పెట్టా.పాలు , పాల ఉత్పత్తులను విక్రయిస్తూ క్రమంగా పాల వ్యాపారంలోకి అడుగు పెట్టా. ఈ వ్యాపారం విజయవంతంగా కొనసాగుతుండగానే, కాకినాడ సమీపంలోని మునసబు తూము వద్ద టిఫిన్ హోటల్ ప్రారంభించా. అక్కడి వ్యాపారం కూడా సజావుగా సాగుతుంది. అలా జరుగుతుండగా కాకినాడ బస్ స్టేషన్ వద్ద కేంటిన్ పాడుకొనే అవకాశం వచ్చింది. ఆ రోజుల్లో నెలకు రూ. 3500 అద్దె ఇవ్వడానికి ఒప్పందం అయింది. దీంతో అక్కడ హోటల్ పాడుకొన్నాము. మంచి వ్యాపారం జరిగేది. లాభాల బాట పట్టింది. చక్కగా వ్యాపారం చేసుకునే వాడిని..1982లో దివంగత నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించారు. వెంటనే హైదరాబాదుకు వెళ్లా. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయన సమక్షంలో పార్టీలో చేరా. పార్టీ సభ్యత్వాలు చేయించమని రామారావు ఆదేశించారు. అప్పటి తాళ్లరేవు నియోజకవర్గంలో జోరుగా సభ్యత్వాలు చేయించా. ఇది ఎన్టీఆర్‌కు నచ్చింది. కానీ, సీటు ఇవ్వడానికి సంకోచించారు. అన్నీ బాగానే ఉన్నా సొమ్ములు లేవు కదా అన్నారు. రూ. లక్ష దాకా ఖర్చు పెట్టుకోగలనని అన్నా. నాతో పాటు చాలా మంది ప్రయత్నించారు. కానీ ఎన్టీఆర్ నాకు టిక్ పెట్టారు.1983లో తొలి పోటీలలో 32,000 మెజార్టీతో వచ్చింది. నాటి నుంచి ఐదు పర్యాయాలు తాళ్లరేవు నియోజకవర్గంలో వరుస విజయాలు అందుకున్న. 1994లో ప్రాథమిక పాఠశాల విద్య మంత్రిగా, 1999లో సహకార శాఖ మంత్రిగా పనిచేశా. 2012లో జరిగిన రామచంద్రపురం ఉప ఎన్నికల్లో పోటీ చేశా. కానీ, తక్కువ ఓట్ల మెజారిటీ మాత్రమే సాధించగలిగాను. ముందుగా ప్రిపేర్ అవ్వడం వల్ల ఇబ్బంది కలగలేదు. 2004 నుంచి 2017 వరకు నేను ఏ పదవీలోనూ లేను. పార్టీ అధికారంలో ఉన్నా, నేను మాత్రం సామాన్యుడిగానే ఉన్నా. ఆ తర్వాత 2017లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శాసన మండలి సభ్యుడిగా అవకాశం ఇచ్చారు. ఆ పదవి కాలం కూడా ఇప్పుడు ముగిసింది.నా దగ్గర డబ్బు లేదనే బాధ లేదు. ఆస్తులు కూడా పెద్దగా లేవనే ఆవేదన లేదు. రాజకీయ వారసులు లేరనే సంకోచం లేదు. ఏకైక కుమారుడిని సాఫ్ట్వేర్ ఇంజనీర్ విద్యనభ్యసించాడు. రాజకీయాల్లోకి తీసుకురాలేదు. నీతి వంతుడిగా గుర్తింపు తెచ్చుకున్న. జయ ప్రకాష్ నారాయణ ఒకసారి నీతి వంతమైన రాజకీయ నాయకుడిగా గుర్తింపు ఇచ్చారు. తర్వాత అనేక మార్లు చంద్రబాబు కూడా మెచ్చుకున్నారు. నా జీవితానికి ఇవే పెద్ద ఆస్తులు. చాలా సంతృప్తిగా ఉంది.

## నడిరోడ్డులో నిలిచిపోయిన లారీ..

### వాహనదారులకు ఇబ్బందులు

ఒంగోలు ప్రకాశం జిల్లా కొమరోలు పట్టణంలో నడిరోడ్డుపై ఓ లారీ నిలిచిపోయింది. రోడ్డుపై వెళ్తున్న లారీ నుండి అకస్మాత్తుగా టైరు విడిపోవడంతో ఆది నడిరోడ్డుపై నిలిచిపోయింది. దీంతో అమరావతి కడప రాష్ట్రీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్కొక్కసారి ఈ ప్రాంతంలో ట్రాఫిక్ అధిక సంఖ్యలో నిలిచిపోతుందని వాహనదారులు అంటున్నారు.

## అర్ధరాత్రి కత్తిపోట్ల కలకలం

తిరుపతి ముత్యాలరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కత్తిపోట్లు ఘటన చోటు చేసుకుంది. బుధవారం అర్ధరాత్రి 12:30 గంటలకు ఘటన జరిగింది. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో అవిలాలకు చెందిన జ్ఞానేంద్ర రెడ్డి పై కత్తితో దాడి జరిగింది. బాధితుడి శరీరంపై ఏడు కత్తిపోట్లు వున్నాయి. ఎంఆర్ పల్లి చెందిన లోకేష్ కత్తితో పొడిచిన వైనం. రక్తపు గాయాలతో కొట్టుమిట్టాడుతున్న జ్ఞానేంద్ర, పోలీసులు రుయా ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయ స్థితిలో రుయాలో చికిత్స పొందుతున్నాడు. కత్తితో పొడిచిన అనంతరం లోకేష్ ముత్యాల రెడ్డి పల్లి పోలీస్ స్టేషన్ లో లొంగిపోయినట్లు సమాచారం.

## జీవితఖైదీ మృతి

కడప కడప కేంద్ర కారాగారంలో జీవిత ఖైదీ తెలుగు రామాంజనేయులు (58) చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనుభవిస్తున్న నంద్యాల జిల్లా వెలుగోడుకు చెందిన రామాంజనేయులు, హత్యా నేరం కేసులో కడప కేంద్ర కారాగారంలో జీవితఖైదు శిక్ష ను అనుభవిస్తున్నాడు. ఏప్రిల్ 17న తీవ్ర అస్వస్థతకు గురికావడంతో రామాంజనేయులను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి కారాగార సిబ్బంది తరలించారు. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఖైదీ రామాంజనేయులు మృతి చెందాడు. ఖైదీ రామాంజనేయులు మృతి సమాచారాన్ని జైలు అధికారులు అతని కుటుంబసభ్యులకు తెలిపారు.

## పేదలకు నిత్యవసర వస్తువులు పంపిణీ

బద్వేలు సాయిబాబా చారిటబుల్ ట్రస్ట్ షిరిడి వారి ఆర్థిక సహాయంతో సంఘమిత్ర సంస్థ వారు గురువారం బద్వేలు మున్సిపాలిటీ పరిధి లో సాయిబాబా నగర్ నివాసం లో జీవిస్తున్న పేద కుటుంబాల వారికి దాదాపు 35 మందికి పైగా వంట సరుకులు బియ్యము, కంది బేడలు, చక్కర, ఆయిల్ ప్యాకెట్, పసుపు, ఉప్పు, కారం ప్యాకెట్లు ఉచితంగా పంపినీ చేయడమైనది. ఎంతో ఉదార స్వభావం తో ఆర్థిక సహాయం చేసిన సాయిబాబా చారిటబుల్ ట్రస్ట్ సీరిడి వారికి సంఘమిత్ర సమస్తరుపున కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు సద్దల పెంచలయ్య కోఆర్డినేటర్స్ గోపిరెడ్డి వసంత సుధామణి డైరెక్టర్ సుబ్బారెడ్డి చంద్రమోహన్ రెడ్డి అమర్నాథ్ రెడ్డి సిపిఐ పార్టీ ఏరియా కార్యదర్శి బాల ఓబులు పాల్గొన్నారు

## తిరుపతి స్విమ్స్ లో రంగన్నకు చికిత్స

తిరుపతి వివేకా హత్య కేసులో కీలక సాక్షి వాచ్ మెన్ రంగన్నకు ఐసీయూలో చికిత్స కొనసాగుతోంది. శ్వాసకోశ సంబంధ వ్యాధితో బాధపడుతున్న రంగన్నను పోలీసులు స్విమ్స్ కు తీసుకొచ్చారు. వైద్యులు రంగన్నకు ఆర్ఎఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. రంగన్నకు పోలీసులతో ప్రత్యేక భద్రత ఏర్పాటు చేసారు.

## నలుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

తిరుపతి రాత్రి పూట ఇళ్లల్లో దొంగతనాలు చేసే న అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన నలుగురిని పోలీసులు అరెస్టు చేసారు. నిందితులనుంచి 870 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు 35 లక్షల రూపాయలు వుంటుందని జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి వెల్లడించారు.పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఆటో నగర్ బస్ స్టాప్ వద్ద ఉన్న నలుగురు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్ఆరు. విచారణ తరువాత వారిని అరెస్ట్ చేసారు. వారినుంచి 870 గ్రాముల బంగారు ఆభరణములు స్వాధీనము చేసుకున్నారు. పోలీసులు చూసిన నిందితులు పారి పోవడానికి ప్రయత్నించారు. అయినా వారిని వెంటబడి పట్టుకున్నారు. నిందితులు చెడు వ్యసనాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యముతో చంద్రగిరి మరియు తిరుపతి లోని పలు ప్రాంతాల యందు పగటి పూట తాళము వేసి ఉన్న ఇంటి పరిసరాల వద్ద రెక్కి నిర్వహించి, రాత్రి వేళ్ళలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. కృష్ణప్ప రాజేష్, మొగిలి భాను ప్రకాష్, దలవాయి చందు, నామ్మే రామాంజినేయుల పై పలు కేసులు నమోదయ్ఆయ్యాయి.

# మారుతున్న రేషన్ కార్డు నిబంధనలు

విజయవాడ, మే 4, రెండేండ్ల క్రితం కరోనా మహమ్మారి తీవ్ర స్థాయిలో ఉన్న సమయంలో దారిద్య్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఉచిత రేషన్ అందించింది. కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్ వన్ రేషన్ విధానాన్ని అప్పట్లో అమలు చేసిన సంగతి తెలిసిందే. షనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్-2013 కింద ఈ కార్డులను జారీ చేస్తారు. రేషన్ కార్డులనే ఫుడ్ సెక్యూరిటీ కార్డ్ అని కూడా పిలుస్తారు. కానీ.. పలువురు కార్డు దారులు రేషన్ కార్డు పొందేందుకు అనర్హులైనప్పటికీ రేషన్, ఇతర ఉచితాలనుఈ కార్డు ద్వారా పొందుతున్న విషయంపై కేంద్రం దృష్టి సారించింది. అనర్హులకు ఈ సౌకర్యాలు అందకుండా చూసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. అందువల్ల అనర్హులైన వారు తమ రేషన్ కార్డులను తక్షణం సరెండర్ చేయాలని ప్రభుత్వం హెచ్చరిస్తోంది. ఒకవేళ అనర్హులైన కార్డుల యజమానులు తమ రేషన్ కార్డులను సరెండర్ చేయకపోతే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పింది.గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000 లోపు, నగరప్రాంతాల్లో రూ.2,00,000 లోపు వార్షిక ఆదాయం ఉన్నవారు రేషన్ కార్డులు పొందేందుకు అర్హులు. రూ.3.5 ఎకరాల లోపు పంటపొలాలు, రూ.7.5 ఎకరాల లోపు బీడు భూమి ఉన్నవారు కూడా రేషన్ కార్డు తీసుకోవచ్చు. ఈ తాజా నిబంధనల ప్రకారం.. రూ.10 వేల లోపు వార్షిక ఆదాయం ఉన్న వారిని మాత్రమే దారిద్య్రరేఖకు దిగువన ఉన్నకుటుంబాలుగా గుర్తించి కార్డు జారీ చేస్తారు. ఎల్లో రేషన్‌కార్డు పొందాలంటే.. కుటుంబంలో డాక్టర్, న్యాయవాది, ఆర్కిటెక్, చార్టర్డ్ అకౌంటెంట్ ఉండకూడదు. వార్షికాదాయం రూ.15 వేల వరకు ఉన్న కుటుంబాలు. ప్రొఫెషనల్ టాక్స్, సేల్స్ టాక్స్, ఇన్‌కమ్ టాక్స్ చెల్లించని కుటుంబాలు. రెసిడెన్షియల్‌లో ఫోన్, కారు, కుటుంబంలోని సభ్యులందరికీ కలిపి రెండు హెక్టార్ల మెట్ట, హెక్టార్ మాగాణి, కరువు ప్రాంతాల్లో అర్ధ హెక్టార్ భూమి కూడా లేని వారిని మాత్రమే అర్హులుగా పరిగణిస్తారు.అర్హతలు లేకపోయినా రేషన్ కార్డు పొందినా, ఉపయోగించినా చట్టపరంగా చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అనర్హులు రేషన్ కార్డుల్ని ఉపయోగిస్తున్నట్లైతే ప్రభుత్వానికి సరెండర్ చేయాలి. 100 చదరపు మీటర్ల కంటే ఎక్కువ నిడివి గల ఇల్లు లేదా ఫ్లాట్, కారు లేదా ట్రాక్టర్, గ్రామంలో రూ.2 లక్షలకంటే ఎక్కువ వార్షికాదాయం, నగరాల్లో రూ.3 లక్షల కంటే ఎక్కువ వార్షికాదాయం గల వారు సంబంధిత తహసీల్దార్‌కు గానీ, డీఎస్‌వో ఆఫీసులో గానీ రేషన్ కార్డు సరెండర్ చేయాలి ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ కార్డ్ రూల్స్ చూస్తే అర్బన్ ప్రాంతాల్లో రూ.75,000 లోపు వార్షికాదాయం, గ్రామీణ ప్రాంతాల్లో రూ.60,000 లోపు వార్షికాదాయం ఉన్నవారు రేషన్ కార్డ్ తీసుకోవచ్చు. ఐదు ఎకరాల లోపు భూమి ఉన్నవారు కూడా రేషన్ కార్డ్ పొందడానికి అర్హులు. 100 చదరపు మీటర్ల ప్లాట్, ఇల్లు, ఫ్లాట్, ఫోర్ వీలర్, కార్, ట్రాక్టర్, రూ.2 లక్షల కన్నా ఎక్కువ వార్షికాదాయం ఉన్నవారికి రేషన్ కార్డ్ ఇవ్వరు. ఒకవేళ వారు రేషన్ కార్డ్ ఉపయోగిస్తున్నట్లైతే తహసీల్దార్ ఆఫీసులో సరెండర్ చేయాలి. తమ దగ్గర రేషన్ కార్డ్ ఉంటే సరెండర్ చేయాలి. ప్రొఫెషనల్ ట్యాక్స్ పేయర్స్, సేల్స్ ట్యాక్స్ పేయర్స్, ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లిస్తున్నవారు కూడా రేషన్ కార్డ్ సరెండర్ చేయాల్సి ఉంటుంది. గతంలో రేషన్ కార్డ్ తీసుకున్నవారు ఆర్థికంగా స్థిరపడినట్లైతే.. వారు కూడా ఇప్పుడు రేషన్ కార్డును ప్రభుత్వానికి సరెండర్ చేయాల్సిందే.

## వైద్యకళాశాల భవనాలను త్వరగా పూర్తిచేయాలి

**జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్**

విజయనగరంప్రభుత్వ వైద్యకళాశాల భవనాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక ట్రైబల్ యూనివర్సిటీ సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలను ఆమె గురువారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, సెమినార్ హాలు, హాస్టల్ తదితర భవనాల నిర్మాణాన్ని, వాటి నాణ్యతను, ఇతర సదుపాయాల కల్పనను పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన ఖర్చు, చేసిన పనులు, బిల్లుల పరిస్థితి, సిమ్మెంట్, ఐరన్, ఇసుక సరఫరా, పనివారి సంఖ్య తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఏపి ఎంఎస్‌ఐడిసి అధికారులు ఆయా భవనాల పురోగతిని కలెక్టర్కు వివరించారు. తరగతి గదుల నిర్మాణం పూర్తి అయ్యిందని, విద్యుత్ వైరింగ్, ప్లంబింగ్, ఫ్లోరింగ్, వెలుపల గోడలకు ప్లాస్టింగ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. మరో రెండు నెలల్లో పనులను పూర్తి చేస్తామని చెప్పారు. కళాశాలకు నీటి సదుపాయం కోసం సంప్యాంకును నిర్మించామని, తాత్కాలికంగా మున్సిపాల్టీ నుంచి రోజుకు సుమారు 35వేల లీటర్ల నీటిని ఇప్పించాలని అధికారులు కోరారు. మెడికల్ కాలేజీకి నీటి అవసరాలను శాశ్వతంగా కల్పించేందుకు చంపావతి నదినుంచి పైప్లైన్ వేసేందుకు రూ.10కోట్లు ఖర్చుతో ప్రతిపాదనలు సిద్దంగా ఉన్నాయని వివరించారు.

కలెక్టర్ నాగలక్ష్మి స్పందిస్తూ, మున్సిపాల్టీనుంచి తాత్కాలికంగా నీటిని ఇప్పించేందుకు వెంటనే సంబంధిత అధికారులతో చర్చిస్తానని చెప్పారు. శాశ్వత పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తరగతి భవనాల నిర్మాణం దాదాపు పూర్తి అయినప్పటికీ, ఇతర పనులు పెండింగ్ ఉన్నాయని, వాటిని పూర్తిచేసేందుకు నిపుణులైన పనివారి సంఖ్యను పెంచాలని సూచించారు. భవన నిర్మాణ పనులను, రహదారిని వీలైనంత త్వరగా పూర్తి చేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డిఆర్ఓ ఎం.గణపతిరావు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ పద్మలత, ఎపిఎంఎస్‌ఐడిసి సూపరింటిండెంట్ ఇంజనీర్ అంకమ్మ చౌదరి, ఇఇ సత్య ప్రభాకర్, విశాఖ ఎస్ఈ శివశంకర్, తాశిల్దార్ సిహెచ్.బంగార్రాజు, నాగార్జున కన్స్ట్రక్షన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సంగీతానికి మూల విరాట్ త్యాగరాజ స్వామి

**- విద్వాన్ పద్మావతి**

కాకినాడ కర్ణాటక సంగీతానికి మూలవిరాట్ అయిన త్యాగరాజ స్వామి అసంఖ్యాక కీర్తనలకు ప్రాణం పోసారని విద్వాన్ టి. పద్మావతి పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి జయంతి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పద్మావతి మాట్లాడుతూ తల్లి అలవర్చిన భక్తి సంగీతాలు బాల్యంలోనే బీజాంకురాలై త్యాగరాజస్వామి లో మూర్తి భవించాయని అన్నారు. సంగీతంలో తన ప్రావీణ్యాన్ని ప్రదర్శించడం కన్నా భగవారాధనకు ఒక సాధనగా సంగీతాన్ని ఆయన వినియోగించారని అన్నారు 96 కోట్ల సార్లు రామ నామాన్ని జపించి స్వీయానుభవ బావనలే కృతి రూపంలో మలచి గంధర్వ గాన మ దురానుభూతిగా లోకానికి అందించారని అన్నారు. ఈ సందర్భంగా పద్మావతి త్యాగరాజ కీర్తనలను ఆలపించారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో పద్మావతిని ఘనంగా సత్కరించారు. తొలుత త్యాగరాజస్వామి చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, రేలంగి బాపిరాజు, రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## బాలినేని వర్సెస్ సుబ్బారెడ్డి



ఒంగోలు, మే 4, పార్టీ పదవులకు రాజీనామా చేసిన బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యవహారం ఎటూ తేలలేదు. మంగళవారం బాలినేని శ్రీనివాసరెడ్డిని తాడేపల్లి సిఎం కార్యాలయానికి పిలిపించి మాట్లాడినా ఆయన మెత్తబడలేదు. వైసీపీలో ఏ నాయకుడిని బుజ్జగించని విధంగా ముఖ్యమంత్రి స్వయంగా బాలినేని శ్రీనివాసరెడ్డిని సముదాయిస్తున్నా ఆయన బెట్టు వీడలేదు. సిఎం జగన్‌తో బాలినేని చర్చలు విఫలమైనట్లు తెలుస్తోంది. ఆరోగ్యం సరిగా లేని కారణంగా రీజినల్ కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వర్తించలేనని బాలినేని తేల్చి చెప్పారు. సొంత నియోజకవర్గంపై దృష్టి పెట్టాల్సి ఉందని, జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై తన వైఖరిని స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది.ప్రకాశం జిల్లా బాధ్యతల నుంచి తప్పించడంపై బాలినేని అసంతృప్తి వ్యక్తం చేసినా ఫలితం లేకపోయింది. ప్రకాశం జిల్లా బాధ్యతలు బాలినేనికి అప్పగించేందుకు జగన్ విముఖత చూపినట్లు ప్రచారం జరుగుతోంది. వైసీపీలో ఎవరికి సొంత జిల్లా బాధ్యతలు అప్పగించలేదని బాలినేనికి జగన్ గుర్తు చేసినట్లు చెబుతున్నారు. ఒక్కరి కోసం ఉన్న పద్ధతులు మార్చలేమనే అభిప్రాయాన్ని జగన్ వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్‌గా కొనసాగాల్సిందిగా బాలినేనికి జగన్ సూచించడంతో బాలినేని నిరాకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రితో భేటీ తర్వాత మరో మార్గంలో కార్యాలయం నుంచి బాలినేని బయటకు వెళ్లిపోయారు.ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలలో అసంతృప్తికి బాలినేని కారణమనే నివేదికలు ముఖ్యమంత్రికి అందడంతోనే సొంత జిల్లా బాధ్యతలు అప్పగించడానికి విముఖత చూపినట్లు తెలుస్తోంది. టీడీపీ నుంచి బలమైన నేతలు వైసీపీలోకి రావడం వల్ల అయా ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న వారిలో కొంత అసంతృప్తి ఉంది. జిల్లాకు చెందిన మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి పెత్తనం ఎక్కువ ఉందనే భావన మిగిలిన ఎమ్మెల్యేలలో ఉండటంపై పలు సందర్భాల్లో ముఖ్యమంత్రి నివేదికలు అందాయి.మంత్రి వర్గ పునర్వ్యస్థీకరణ ముందు వరకు జిల్లాలో ఉన్న నేతలెవరు తమకు స్వతంత్రత లేదని భావించే వారు. జిల్లా కలెక్టర్., ఎస్పీ పూర్తిగా మంత్రి బాలినేని చెప్పు చేతల్లో ఉండటం వల్ల తమకు గుర్తింపు., ప్రాధాన్యత లేకుండా పోయిందని ఎమ్మెల్యేలు భావించే వారు. బాలినేని పదవిలో ఉన్న సమయంలో మరో మంత్రి ఆదిమూలపు సురేష్, బాలినేని ఎదుట మాట్లాడేందుకు సైతం సాహసించే వారు కాదని జిల్లా నేతలు గుర్తు చేస్తున్నారుఇరువురు ఒకేచోట ఉండాల్సిన వచ్చినపుడు ఆయన మౌనంగా ఉండిపోయేవారని చెబుతున్నారు. జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోట కూడా, ఎమ్మెల్యేలు ఇతర సామాజిక వర్గానికి చెందిన వారైతే, పనుల కోసం వచ్చే వారు నేరుగా మంత్రి బాలినేని వద్దకే వెళ్లేవారు. కాంట్రాక్టులు., ఇతర పనుల కోసం అధికారులు ఎమ్మెల్యేల సిఫార్సులను సైతం పరిగణలోకి తీసుకునే వారు కాదని గుర్తు చేస్తున్నారు. మంత్రి వర్గ ప్రక్షాళన ముందు వరకు పేరుకు మాత్రమే తాము ఎమ్మెల్యేలమనే భావన చాలామందిలో ఉంది. ఈ భావనలు పార్టీకి దీర్ఘకాలంలో నష్టం చేసే అవకాశం చేస్తాయనే ఆలోచనలతోనే సిఎం బాలినేనికి చెక్ పెట్టినట్టు చెబుతారు.బాలినేని అలక వెనుక జిల్లా రాజకీయాలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. మార్కాపురం సభలో ప్రోటోకాల్ వివాదం, డిఎస్పీ నియామకం కంటే ఇతర కారణాలతోనే బాలినేని బెట్టు వీడటం లేదని ప్రచారం జరుగుతోంది. ప్రకాశం జిల్లా రాజకీయాల్లో ఆధిపత్య పోరు కూడా తారాస్థాయికి చేరుకుంది. గత ఏడాది టిటిడి ఛైర్మన్ ? పదవీ కాలం ముగియడంతో జిల్లా రాజకీయాల్లో మళ్లీ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని వైవి సుబ్బారెడ్డి ప్రయత్నించారు. ఆ సమయంలో వైవీ సుబ్బారెడ్డికి ఎమ్మెల్సీ, మంత్రి పదవి దక్కకుండా బాలినేని అడ్డుపడ్డారని ప్రచారం జరిగింది.

## ప్రజలందరికీ గంగమ్మ దేవత ఆశీసులు ఎల్లపుడూ ఉంటాయి

డా.సతీష్ రెడ్డి తిరుపతి, మే 03 ఆద్యాత్మిక నగరం తిరుపతిలో వెలసిన గంగమ్మ దేవత స్వయానా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి చెల్లెలని, ప్రాచాన కాలం నుండి ముందుగా గంగమ్మ దేవతను దర్శించుకుని తిరుమల స్వామివారి దర్శనానికి వెళ్ళే ఆచారం ఉండేదని రక్షణ శాఖ సలహాదారు డా.సతీష్ రెడ్డి అన్నారు. స్థానిక తాతయ్య గుంట గంగమ్మ తల్లి పునః ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొనడానికి విచ్చేసిన రక్షణ శాఖ సలహాదారు డా.సతీష్ రెడ్డి , కుటుంబ సభ్యులకు తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, నగర మేయర్ డాక్టర్ శిరీష, తిరుపతి మున్సిపల్ కమిషనర్ డి. హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్ర నారాయణ ఆలయ మర్యాదలతో స్వాగతనీ పలికారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఆలయ సందర్శన, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పునః ప్రతిష్టాపన యజ్ఞం, యాగశాలలో ఉన్న ప్రధాన కలశము వద్ద వెండి యంత్రము మరియు బంగారపు యంత్రమును వేదపండితులు వీరి చేతులమీదుగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.సతీష్ రెడ్డి మాట్లాడుతూ గత గంగమ్మ తల్లి వైభవాన్ని తీసుకుని రావడానికి స్థానిక శాసనసభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమని, ప్రజలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహిస్తే గంగమ్మ దేవత ఆశీసులు అందరికీ ఉంటాయని అన్నారు. స్వయానా తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి చెల్లెలు గంగమ్మ దేవతకు గత 700 సంవత్సరాలుగా జాతరలు నిర్వహించాడనీ జరుగుతున్నదని దేశంలోనే జాతర ఇక్కడే మొదలైనట్లు ఆదారాలు ఉన్నాయని అన్నారు. స్వామి వారు తన చెల్లెలు గంగమ్మ దేవతకు సారె ఇవ్వడం అనావాయితీ అని, నేడు ఇదే ఆనవాయితీ దేశంలో ప్రతి కుటుంబంలో అక్కచెల్లెలకు సారె ఇవ్వడం మొదలైందని అన్నారు. నేడు ఆలయ పునరుద్ధరణ, పునః ప్రతిష్ట కార్యక్రమాలను పీటాధిపతులు స్వరూపానందస్వామి, విజయేంద్ర సరస్వతి లు పాల్గొనడం జరుగుతున్నదని అన్నారు. ఇకపై తిరుమల స్వామి వారి దర్శనానికి వెళ్ళే ముందు గంగమ్మ దేవతను దర్శించుకునే ఆచారం గుర్తు తెచ్చుకుని అందరూ భక్తీ శ్రద్ధలతో పూజించాలని అన్నారు.

## 1249 కోట్లే... పోలవరానికి ఇవ్వాలి

విజయవాడ, మే 4, జాతీయ ప్రాజెక్టుగా హోదా లభించిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రూ.1249కోట్లు మాత్రమేనని కేంద్రం తేల్చేసింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నత్తనడకన సాగుతుండగా పెండింగ్‌లో ఉన్న నిధులపై ఆర్టీఐ దరఖాస్తుకు కేంద్రం ఈ స్పష్టత ఇచ్చింది. ఓ వైపు మరమ్మతులు, ధ్వంసమైన డయాఫ్రం వాల్ పునర్నిర్మాణం, ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ నిర్మాణం విషయంలో సమస్యలు ఎదుర్కొంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం మరో షాక్ ఇచ్చింది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చిన తర్వాత ప్రాజెక్టు నిర్మాణం కోసం విడుదల కావాల్సిన నిధుల్లో ఇంకా రూ.1249కోట్లు మాత్రమే బాకీ ఉందనికేంద్ర జలసంఘం తేల్చేసింది.ఆర్టీఐ దరఖాస్తుకు కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజినీరు ఈ మేరకు సమాచారాన్ని పంపారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం ఇవ్వాల్సిన నిధులు రూ. 1,249 కోట్లేనని సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది. “పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కేంద్రం ఇంకా ఎన్ని నిధులివ్వాలి? ప్రాజెక్టుకు రావాల్సిన తుది నిధులెన్ని? అంటూ విశాఖపట్నంకు చెందిన వి.రమేశ్‌చంద్ర వర్మ సమాచారహక్కు చట్టం కింద కేంద్రాన్ని ప్రశ్నించారు.కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజినీరు సీడబ్ల్యూసీకి అందుబాటులో ఉన్న సమాచారం మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు రూ.1,249 కోట్ల రుపాయలను ఏపీకి ఇవ్వాల్సి ఉందని సమాధానమిచ్చారు. కేంద్ర ఆర్థికశాఖ సమాచారం ప్రకారం 2014 ఏప్రిల్ 1నాటికి ప్రాజెక్టు నిర్మాణంలో సాగునీటి విభాగం కింద చేసే ఖర్చును ఏపీకి కేంద్రం తిరిగి చెల్లించనుందని పేర్కొన్నారు.2017-18 ధరల ప్రకారం ఇంకా రూ.28 వేల కోట్ల రుపాయలు ఖర్చు చేస్తేనే ప్రాజెక్టును పూర్తి చేయడం సాధ్యమవుతుంది. రకరకాల కారణాలతో ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమవుతోంది. ప్రధాన డ్యాంతో పాటు ఎడమ కాలువ, ఇతర పనుల్లో జాప్యం జరుగుతోంది. నిర్మాణం ఆలస్యమయ్యే కొద్దీ ధరల భారమూ పెరుగుతుంది. పోలవరం కొత్త డీపీఆర్‌కు కేంద్రప్రభుత్వ ఆమోదం కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి పోలవరం ప్రాజెక్టు రివైజ్డ్ అంచనాలను అమోదించాలని ముఖ్యమంత్రి కోరుతున్నా ఫలితం మాత్రం ఉండట్లేదు.పోలవరం ప్రాజెక్టు రూ. 47,725 కోట్లు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోవాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని పదేపదే కోరుతోంది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ సూచన మేరకు 2019కు ముందే అప్పటి ప్రభుత్వం రూ.55 వేల కోట్ల అంచనా వ్యయంతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని 2017-18 ధరలతో డీపీఆర్ 2 కేంద్రానికి సమర్పించింది. ఆ డీపీఆర్‌కు కేంద్ర జలసంఘంలోని సాంకేతిక సలహా మండలి ఆమోదించాల్సి ఉంది.అప్పట్లో డిపిఆర్‌పై అనేక అభ్యంతరాలు లేవనెత్తారు. ఎన్నో సందేహాలు వ్యక్తంచేశారు. ఆ వివరాల్నీ కేంద్ర జలసంఘానికి ఏపీ జలవనరుల శాఖ అధికారులు అందించారు. వేల పేజీల సమాధానాలు పంపారు. కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యాలయంలో కూర్చుని ఒక బృందం సమాధానాలిచ్చి వచ్చింది. ఆ ప్రక్రియ తర్వాత కేంద్ర జలసంఘంలోని సాంకేతిక సలహా కమిటీ పోలవరం డీపీఆర్‌ను దాదాపు రూ.55,548.87 కోట్లకు ఆమోదించింది. 2019 ఫిబ్రవరిలోనే ఆ మేరకు కొత్త ధరలతో నిధులిచ్చేందుకు ఆమోదించింది.డిపిఆర్ 2కుఅమోదం లభించిన తర్వాత కేంద్ర జల్‌శక్తి శాఖ ఈ అంశాన్ని రివైజ్డు కాస్ట్ కమిటీకి అప్పగించింది. ప్రాజెక్టు వ్యయాన్ని రూ. 47,725 కోట్లకు ఆమోదం తెలిపారు. కీలక దశలు ఇప్పటికే పూర్తి కావడంతో కేంద్ర ఆర్థికశాఖ ఆమోదించి కేంద్ర మంత్రిమండలి ఆమోదం దక్కించుకోవడం మిగిలిఉంది. ఈ సమయంలో డీపీఆర్‌ను మళ్లీ పోలవరం అథారిటీకి వెనక్కు పంపారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ వద్ద రెండేళ్లుగా ఆ డీపీఆర్ పెండింగులోనే ఉంది.

## ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వెనుకబడిన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆలయాల నిర్మాణం

**- సీతంపేట శ్రీవారి ఆలయంలో భక్తులకు దర్శనం ప్రారంభం**

**- శుభకార్యాల కోసం గిరిజనులకు ఉచితంగా కల్యాణ మండపం**

**- కురుపాంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి చర్యలు**

**- టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి**

**- సీతంపేటలో ఆగమోక్తంగా శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ**

సీతంపేట, మే 04 రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ధర్మ ప్రచారంలో భాగంగా గిరిజన, మత్స్యకార, దళితవాడలు ఇతర వెనుకబడిన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆలయాల నిర్మాణం చేపడుతున్నామని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో టిటిడి నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వైవి.సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి తిరుమలకు విచ్చేసి స్వామివారిని దర్శించుకోలేని భక్తుల కోసం గడిచిన నాలుగేళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని వెనుకబడిన ప్రాంతాల్లో సుమారు 2 వేల ఆలయాల నిర్మాణానికి చర్యలు చేపట్టామని తెలిపారు. సీతంపేటలో ఒకటిన్నర సంవత్సరాల అతి తక్కువ వ్యవధిలో దాదాపు రూ.10 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టామని చెప్పారు. ఆలయం వద్ద నిర్మించిన కల్యాణ మండపాన్ని మరింతగా విస్తరించి, చుట్టుపక్కల గిరిజన భక్తులు ఉచితంగా శుభకార్యాలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. మరో గిరిజన ప్రాంతమైన రంపచోడవరంలో ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకు నూతన ఆలయం మహా సంప్రోక్షణ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతమైన కురుపాంలో శ్రీవారి ఆలయాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజనులకు రవాణా, వసతి, ఆహారం ఉచితంగా కల్పించి తిరుమల బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ద్వార దర్శనం ఉచితంగా చేయిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతాల నుంచి స్వామివారి మీద అచంచలమైన భక్తి విశ్వాసాలతో వేలాది మంది శ్రీవారి సేవకులు తిరుమలకు విచ్చేసి తోటి భక్తులకు సేవ చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. వీరందరికీ స్వామివారి ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకుంటున్నానని, రాబోయే రోజుల్లో ఈ ప్రాంతాల నుండి మరింతమంది శ్రీవారి సేవకులుగా భక్తులకు సేవలు అందించాలని కోరారు.ఆగమోక్తంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ ఈ సందర్భంగా ఉదయం యాగశాలలో మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఆ తరువాత కుంభ ప్రదక్షిణ చేశారు. ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్య వృషభ లగ్నంలో మహాసంప్రోక్షణ, కళావాహన చేపట్టారు. ఈ క్రతువుల ద్వారా యాగశాలలోని కలశాలలో ఇమిడి ఉన్న దేవతాశక్తిని శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ పద్మావతి అమ్మవారు, శ్రీ గోదాదేవి, శ్రీ గరుడాళ్వార్, ద్వారపాలకుల విగ్రహాల్లోకి ఆవాహన చేశారు. అనంతరం అక్షతారోపణ, బ్రహ్మఘోష, ఆచార్య బహుమానం అందించారు.భక్తులకు దర్శనం ప్రారంభం మహాసంప్రోక్షణ కార్యక్రమం అనంతరం ఉదయం 10 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం ప్రారంభమైంది. సీతంపేట చుట్టుపక్కల ప్రాంతాల నుంచి విశేషంగా భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. విచ్చేసిన భక్తులందరికీ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.శ్రీవారి సేవకుల విశేష సేవలుసీతంపేట ఆలయ మహాసంప్రోక్షణ సందర్భంగా ఆరు రోజులపాటు నిర్వహించిన కార్యక్రమాల్లో శ్రీవారి సేవకులు విశేష సేవలు అందించారు. భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ, ఆలయానికి అవసరమైన పూలు కట్టడం తదితర సేవలు అందించారు. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల నుంచి దాదాపు 600 మంది శ్రీవారి సేవకులు భక్తులకు సేవలు అందించారు.

ఈ కార్యక్రమంలో ఎంపి చంద్రశేఖర్, జెఈవో వీరబ్రహ్మం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు వి.కళావతి, పుష్పశ్రీవాణి, రెడ్డిశాంతి, కంబాల జోగులు, చిన్న అప్పలనాయుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లాది కృష్ణారావు, ఐటీడీఏ పీవో కల్పనా కుమారి, సబ్ కలెక్టర్ నూరుల్ కోమర్, జిసిసి ఎండి సురేష్ కుమార్, తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలదీక్షితులు, టిటిడి వైఖానస ఆగమసలహాదారు మోహనరంగాచార్యులు, కంకణభట్టార్ శేషాచార్యులు, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఇలు టివి.సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, విజివో మనోహర్, డెప్యూటీ ఈవోలు గుణభూషణ్ రెడ్డి, వెంకటయ్య, శివప్రసాద్, ఇఇ సుధాకర్, ఏఈఓ రమేష్, డెప్యూటీ ఇఇలు ఆనందరావు, నాగరాజు, జెఈ రవికుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భజన, కోలాట కార్యక్రమాలు

సీతంపేటలోని ఆలయం వద్ద గల వేదికపై టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. గిరిజన ప్రాంతాల నుంచి భజన బృందాలు కళారూపాలను ప్రదర్శిస్తున్నారు. వైజాగ్ కు చెందిన కిరణ్మయి బృందం చక్కగా భరతనాట్య ప్రదర్శన చేశారు.

## 3500 మంది ఉద్యోగుల్ని తొలగించనున్న కాగ్నిజెంట్ కంపెనీ




హైదరాబాద్: అమెరికాకు చెందిన కాగ్నిజెంట్ఐటీ కంపెనీ సుమారు 3500 ఉద్యోగుల్ని తొలగించనున్నది. ఆపరేషన్స్‌పై వత్తిడి తగ్గించేందుకు ఆ కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముందుగా నాన్ బిల్లింగ్, కార్పొరేట్ రోల్స్‌లో ఉన్నవారిని తొలగించే ప్రక్రియలో కంపెనీ ఉంది. ఖర్చులు నియంత్రించడంలో భాగంగా ఆఫీసు స్పేస్‌ను కూడా తగ్గించుకోనున్నట్లు కంపెనీ చెప్పింది. ఈ ఏడాది ఆదాయం పడిపోనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

## మాదాపూర్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీకి బాంబు బెదిరింపు కాల్

హైదరాబాద్ : మాదాపూర్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీకి బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. టీసీఎస్ కంపెనీలో బాంబు పెట్టినట్లు ఫోన్ కాల్ రావడంతో.. కంపెనీ యాజమాన్యం అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. టీసీఎస్‌కు చేరుకున్న పోలీసులు.. విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బాంబు లేదని నిర్ధారించారు.అయితే బాంబు బెదిరింపు ఫోన్ కాల్ చేసిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. టీసీఎస్ కంపెనీ మాజీ ఉద్యోగి నిర్వాకంగా పోలీసులు గుర్తించారు. సదరు వ్యక్తిని పట్టుకునేందుకు పోలీసులు యత్నిస్తున్నారు.

# అప్పులు లేకుండా అభివృద్ధి చేయలేము

బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి ఆర్థిక శాఖ మంత్రి



నంద్యాల మా ప్రతినిధి మే 4 విభారె న్యూస్ :- అప్పులు లేకుండా అభివృద్ధి చేయలేమని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి అన్నారు. గురువారం నంద్యాల లో ఆరోగ్య శాఖ విడుదల రజనీ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఆమె వెంట బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి ఉన్నారు. బుగ్గన మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థ లో అప్పులు రాబడి సర్వసాధారణ మని వివరించారు. నంద్యాల లో మెడికల్ కాలేజీ కట్టేందుకు అప్పులు చేశామని తెలిపారు. లోకేష్ కు రాజకీయ పరిణతి లేదని ఇసుక లేని చోట ఇసుక మాఫియా అనడం దారుణమని విమర్శించారు. ఇలాంటి వారు రాజకీయ లోకి వస్తే రాష్ట్ర పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలని పేర్కొన్నారు.

## ఆసుపత్రి సమస్యల పై ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక ప్రాతినిధ్యం





కర్నూలు, మే 4 విభారె న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రివర్యులు విడదల రజినీ మేడమ్ గారు కర్నూల్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ బ్లాక్ ను ప్రారంభిస్తున్న సందర్భంగా....బిబి ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక గౌరవ కర్నూల్ శాసనసభ్యులు హాఫీజ్ అహ్మద్ ఖాన్ గారి ద్వార ప్రభుత్వ హాస్పటల్ లోని సమస్యల పరిష్కారం గురించి ప్రాతినిధ్యం.బి ఐక్య వేదిక సభ్యులు 10 రోజుల పాటు ఆసుపత్రిలో పర్యటించి, సమస్యలను సేకరించారు. ఇదివరకే జిల్లా కలెక్టరు ప్రాతినిధ్యం చేశారు. హాస్పటల్ లో నీటి సరఫరా మొదలుకొని, డాక్టర్ ల, 4 వ తరగతి ఉద్యోగుల నియామకం, అవసరమైన బడ్జెట్ నిధులు విడుదల కొరకు ప్రాతినిధ్యం చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, కార్యవర్గ సభ్యులు మనోహర్ మాణిక్యం, సుంకన్న, రత్నం ఏసేపు, జహంగీర్, తెర్నేకల్ శేషారెడ్డి, అల్లాబాకష్, గడ్డం రామ కృష్ణ గారలు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉచితంగా కరాటే శిక్షణ




కర్నూలు, మే 4 విభారె న్యూస్ :అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ కర్నూల్ నగర సమితి ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో విద్యార్థులకు మే 8 నుండి జూన్ 8 వరకు ఉచిత కరాటే శిక్షణ ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సదా అవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు సద్వినియం చేసుకోవాలని ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు బాబయ్య, బిసన్న లు ఒక ప్రకటనలో తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలం సెలవుల్లో విద్యార్థిని విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడమే కాకుండా ఆత్మరక్షణకు శారీరక దృఢత్వానికి మానసిక వికాసానికి కరాటే ఎంతో ఉపయోగపడుతుందని ముఖ్యంగా నేడు సమాజంలో విద్యార్థుల పైన జరుగుతున్న ఆగడాలను అరికట్టడానికి విద్యార్థినిలకు సెల్ఫ్ డిఫెన్స్ చాలా అవసరమని కావున ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నెల రోజులపాటు అనుభవకుశమైన కరాటే మాస్టర్లతో మే 8 నుండి జూన్ 8 వరకు స్థానిక సిఆర్ భవన్ ప్రతిరోజు సాయంత్రం 5గం నుండి 6 గం వరకు నందు కరాటా శిక్షణ ఇవ్వడంతో పాటు నెల రోజుల తర్వాత వారికి కరాటే సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం జరుగుతా ఉందని కావున ఈ అవకాశాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర నాయకులు హుస్సేన్ భాష కాసిం రవి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాబేజీ చాటున గంజాయి

విశాఖపట్నం పుష్ప తరహాలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరినీ పెందుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్యాబేజీ బుట్టల మాటున బొలెరో వాహనంలో గంజాయి రవాణా అవుతోంది. ఒరిస్సా నుండి క్యాబేజీ బుట్టలు లోడుతో వస్తున్న బొలోరో వాహనాన్ని పోలీసులకు సమాచారంతో తనిఖీ చేసారు. క్యాబేజీ బుట్టలు కిందన 14 బ్యాగుల గంజాయి ని గుర్తించారు. గంజాయితో ఉన్న బొలెరో వాహనాన్ని ఇద్దరు వ్యక్తులను పెందుర్తి పోలీస్ స్టేషన్ కి తరలించి కేసు నమోదు చేసారు.

# రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించండి



నంద్యాల మా ప్రతినిధి మే 4 విభారె న్యూస్ :-నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని ఆస్పత్రి వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం నంద్యాల పట్టణంలోని సర్వజన వైద్యశాలలోని వార్డులను కలియతిరిగి రోగులను ఆత్మీయంగా బాగున్నారా అని పలకరిస్తూ క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సమూన్, ఎపీఎంఎస్ఐడిసి మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని

తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓపి విభాగం మొదలుకొని అన్ని వార్డులు కలియతిరిగి రోగులను ఆత్మీయంగా పలకరిస్తూ అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు మెరుగైన ఆధునిక వైద్య చికిత్సలు అందించి అవసరమైన మందును పంపిణీ చేయాలని వైద్యాధికారులను మంత్రి సూచించారు. ఆసుపత్రిలోని ఓపి బ్లాక్, ఎంసిహెచ్, ఎన్ఐసియు, ఆపరేషన్ థియేటర్లను, అత్యవసర చికిత్స విభాగాలను సందర్శించారు. అలాగే అక్కడే వున్న రోగులతో మాట్లాడుతూ ఇక్కడ సేవలు ఎలా వున్నాయని అడిగి తెలుసుకున్నారు. మందులు సకాలంలో అందిస్తున్నారా లేదా అని గర్భిణీ స్త్రీలతో మాట్లాడారు. ఆసుపత్రిలో వైద్య సేవలు బాగా అందుతున్నాయని రోగులు మంత్రికి నివేదించారు. అనంతరం టెలిమెడిసిన్ విభాగాని సందర్శించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. టెలిమెడిసిన్ కు సంబంధించి జిల్లాలోని ఎక్కడి నుండైనా ఆరోగ్య సిబ్బంది సర్వజన వైద్యశాలలోని స్పెషలిస్ట్ వైద్య సలహాలు తీసుకొని చికిత్స సేవలు పొందవచ్చని మంత్రికి వివరించారు. ఆస్పత్రి పర్యవేక్షకులు వరప్రసాద్, డిప్యూటీ సూపర్డెంట్ మహబూబాషా, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత, నర్సింగ్ పర్యవేక్షకులు నాగరాణి, గైనకాలజిస్ట్ స్నిగ్ధ తదితరులు సంబదిత వార్డుల వివరాలను నివేదించారు.

# మెడికల్ కళాశాలకు 150 ఎంబిబిఎస్ సీట్లు మంజూరు



నంద్యాల మా ప్రతినిధి మే 4 విభారె న్యూస్ :-నంద్యాల ప్రజల చిరకాల వాంఛ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు 90 శాతం మేర పూర్తయ్యాయని... ఈ విద్యా సంవత్సరం 150 మంది ఎంబిబిఎస్ విద్యార్థులు విద్యనభ్యసించేలా జాతీయ వైద్య విద్యా మండలి అనుమతులు మంజూరు చేసిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ లో శరవేగంగా జరుగుతున్న నూతన మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సమూన్, ఎపీఎంఎస్ఐడిసి మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర హస్త కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్ తదితర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ మెడికల్ కళాశాల నిర్మాణానికి ఎన్ని అడ్డంకులు ఎదురైనా చేధించి నిర్మాణ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని

రాష్ట్రంలో ఈ ఏడాది 17 మెడికల్ కళాశాలల నిర్మాణ పనుల్లో ఐదు మెడికల్ కళాశాలలను ప్రాధాన్యతగా తీసుకొని పనులు ప్రారంభించామన్నారు. ఇందులో విజయనగరం, నంద్యాల, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం కాలేజీలలో ఈ ఏడాది ఆగస్టు నుండి మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ విద్యార్థులు విద్యను అభ్యసించేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇప్పటికే మూడు కాలేజీలకు జాతీయ వైద్య విధాన మండలి అనుమతులు వచ్చాయన్నారు. ఈ ఏడాది 750 ఎంబిబిఎస్ సీట్లు రాష్ట్రానికి వస్తాయని మంత్రి వివరించారు.రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా కొత్త జిల్లాల ఏర్పాటులో జిల్లాకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన మెడికల్ కళాశాల నిర్మాణం పనులు పూర్తి చేస్తున్నామన్నారు. ఎన్ని రాజకీయ ఒత్తిళు అడ్డం వచ్చినా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని కళాశాల నిర్మాణానికి విశేష కృషి చేశారని మంత్రి తెలిపారు. నూతన ఒరవడలతో ప్రజలకు అనన్య రీతిలో అనుకూలమైన పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి గారి ఆలోచన విధానాన్ని గమనించాలని మంత్రి సూచించారు.స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల ప్రాంతీయ శిక్షణ కేంద్ర పరిధిలోని 50 ఎకరాల్లో 475 కోట్ల కోట్ల రూపాయలతో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వేగంగా పూర్తవుతున్నాయన్నారు. ప్రజల అత్యవసర వైద్య సేవలకు సంబంధించిన పనులకు కోర్టు కూడా అనుకూలమైన తీర్పునిచ్చిందన్నారు. అంతకుముందు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మెడికల్ కళాశాల నిర్మాణ స్ట్రక్చర్ల చాయ చిత్ర ప్రదర్శనను తిలకించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత, ఆస్పత్రి పర్యవేక్షకులు వరప్రసాద్, డిసిహెచ్ఎస్ జఫ్ఫురుల్లా, డిఎంఅండ్హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# గర్జనలతో కర్నూలు ప్రజలను బలిపశువులుగా చేయవద్దు



కర్నూలు, మే 4విభారె న్యూస్ :: స్వార్థ రాజకీయాల కోసం నకిలీ గర్జనలు చేసి కర్నూలు ప్రాంత ప్రజలను బలిపశువులుగా చేయవద్దని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపకులు ఎం. శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కర్నూలులో డమ్మీ, డ్రామా గర్జనలు చేసి అభివృద్ధి, భోగాలను వైజాగ్, ఉత్తర ఆంధ్ర ప్రాంతంలో చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పాకులడుతుందని అన్నారు. మూడు రాజధానుల విధానం అమలుతో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధి, కర్నూలులో హైకోర్టు ఏర్పాటు కోసం భూమిని ప్రకటిస్తూ కర్నూలులో నిర్వహించిన సీమ గర్జనకు ఐదు నెలలు కావస్తున్న దాని గురంచి ఎవ్వరు నోరు మెదపదం లేదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర ఆంధ్రకు ప్రకటించిన అభివృద్ధి ప్రాజెక్టుల్లో భోగాపురంలో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం, వైజాగ్ నుండి భోగాపురం వరకు ఆరు లెన్ల హైవే రోడ్డు, వైజాగ్ లోని మధురవాడలో అదానీ డేటా సెంటర్ ను

కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపకులు ఎం. శ్రీహర్ష

ప్రకటించడం ఎంతవరకు సబబు అన్నారు. వైజాగ్ లోని డేటా సెంటర్ ఏర్పాటు చేయడం కన్న డేటా సెంటర్‌కు అనువైన ప్రదేశం భౌగోళికంగా, వ్యూహాత్మక స్థానాల వారీగా అనువైన ప్రదేశం కర్నూలు అని అన్నారు. దానికి అనుబంధంగా హైదరాబాద్ – బెంగళూరు హైవేని సూపర్ ఇన్ఫర్మేషన్ హైవేగా ప్రకటించి, ఆరు లెన్లతో అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మన ప్రాంత అభివృద్ధి పై మన నాయకులకు నిబద్ధత లేకపోవడం వల్ల అభివృద్ధి అందని ద్రాక్ష లా మారిందన్నారు. యుగయుగాల నుండి మన నాయకులు మన ప్రాంత ప్రజలను బలిపశువులుగా మార్చి మనకు రావాల్సిన అన్ని అభివృద్ధి ఫలాలను త్యాగం చేయడం అలవాటుగా చేయడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా మన ప్రాంత ప్రజలు చేయి చేయి కలుపుకొని మన ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వాలను డిమాండ్ చేయాల్సిన సమయం ఆసన్నం అయిందన్నారు.

## అసలు పోలీసుల అదుపులో నకిలీ పోలీసులు

చిత్తూరు ఆంధ్రా కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో హల్ చల్ చేస్తున్న నకిలీ పోలీసుల ముఠా పోలీసులకు చిక్కింది.ఖాకీ చొక్కా ముసుగులో ఆంధ్ర కర్ణాటక సరిహద్దులో వాహనాలను తనిఖీ చేసి నగదు వసూలు చేసేవారు. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల నేపథ్యంలో పోలీసులం అంటూ నాయకులను టార్గెట్ చేసుకుని నగదును అందిన వరకూ దోచుకుని పరార్ అవుతారు.. చిత్తూరు జిల్లా పోలీసులకు వచ్చిన సమాచారం మేరకూ ఆంధ్ర సరిహద్దులో కాపు కాసిన నకిలీ పోలీసుల ముఠాను పట్టుకున్నారు.చిత్తూరు జిల్లా, వీకోట మండలం సరిహద్దు ప్రాంతంలోని కర్ణాటక బార్డర్ సమీపంలో గత నెల 5వ తేదీన కర్ణాటక పోలీసులు అంటూ కర్ణాటక రాష్ట్రం, శ్రీనివాసపురానికి చెందిన రియాజ్ భాషా అనే వ్యక్తి నుంచి ఐదు లక్షలు రూపాయల నగదును నకిలీ పోలీసు ముఠా సభ్యులు మోసం చేసి చోరీ చేశారు.దీంతో గత కొద్ది నెలలుగా వి.కోట మండలం, దాసర్లపల్లి పెట్రోల్ బంక్ సమీపంలో నకిలీ పోలీసులు దోపిడీలకు పాల్పడుతున్నట్లు వికోట పోలీసులకు సమాచారం రావడంతో రంగంలోకి దిగిన పోలీసులు పత్రపల్లి చెక్పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. కేజీ ఆఫ్ రోడ్డు వైపు నుంచి వీకోట వైపుకు వస్తున్న ఓ వాహనం నుంచి వ్యక్తి పరారయ్యేందుకు ప్రయత్నించడంతో చాకచక్యంగా పోలీసులు వ్యక్తిని చిక్కడంతో నకిలీ పోలీసు ముఠాను అదుపులో తీసుకున్నామని పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి తెలిపారు.

# నేడు ఉడుమార్పురం 32 వార్డు యందు కల్వర్టు ప్రారంభం




నంద్యాల మా ప్రతినిధి మే 4 విభారె న్యూస్ :- నంద్యాల మున్సిపల్ కార్యాలయం లో కమిషనర్ రవి చంద్రా రెడ్డి ఓ ప్రకటనలో శుక్రవారం ఉదయం 10 గం.లకు ఉడుమల్పురం 32 వార్డు నందు నందు 13 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన కల్వర్టను మునిసిపల్ ఛైర్ పర్సన్ మహాబున్నిసా .సభాధ్యక్షతన ఎంపీ. ఎమ్మెల్యే గారిచే ప్రారంభోత్సవం కార్యక్రమం జరుగుతుందన్నారు . కావున శాసన మండలి సభ్యులు, వైస్ చైర్మన్లు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, కో ఆప్షన్ మెంబెర్స్, వార్డు కౌన్సిలర్స్ తప్పక హాజరు కావాల్సిందిగా కోరారు . .

## రీసర్వే పనులు త్వరగా పూర్తి చేయాలి



నంద్యాల మా ప్రతినిధి మే 4 విభారె న్యూస్ :-రీసర్వే పనులు త్వరగా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ అన్నారు. మున్సిపల్ కార్యాలయం లో గురువారం అడ్మిన్ సెక్రటరీలకు మరియు ప్లానింగ్ సెక్రటరీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ మాట్లాడుతూ .జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం ( రి సర్వే) పథకం అమల్లో భాగంగా ప్రస్తుతము పట్టణంలో ఉన్నటువంటి ప్రభుత్వ ఆస్తులు గుర్తించి , వాటికి సంబంధించిన వివరములు 16ఎఎ ద్వారా ఆన్లైన్ నందు నమోదు చేయాలని సూచించారు. ఆరవ తేదీ లోపు పూర్తి చేయాలని అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు మరియు ప్లానింగ్ సెక్రటరీలకు తెలియజేశారు. . ఈ సమావేశం నందు అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ , రెవిన్యూ ఆఫీసర్ వర ప్రసాద్ , అసిస్టెంట్ సిటీ ప్లానర్ నరసింహా మూర్తి , వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు మరియు ప్లానింగ్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

## నియోజకవర్గాల వారీగా మైనార్టీ సమావేశాలు

విజయవాడ, మే 4, ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిం వర్గాలను మరింత దగ్గర చేసుకునేందుకు వైఎస్ఆర్‌సీపీ భారీ స్కెచ్ వేస్తున్నట్టు తెలుస్తోంది. ముస్లిం వర్గాలతో నియోజకవర్గాల వారీగా అవసరమైతే ప్రాంతాల వారీగా సమావేశాలు నిర్వహించాలని ప్లాన్ చేస్తోంది. ఈ మేరకు కీలక నేతలతో అధినాయకత్వం మంతనాలు జరుపుతున్నట్టు పార్టీలో జోరుగా ప్రచారం నడుస్తోంది. కీలకంగా ఉన్న ముస్లిం మైనార్టీ వర్గాలతో ప్రభుత్వ సలహాదారు, పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సమావేశం అయ్యారు. ముస్లిం మైనారిటీలను ఓటు బ్యాంకుగా గతంలో రాజకీయపార్టీలు ఉపయోగించుకునేవని సజ్జల కామెంట్ చేశారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి, నేడు వైఎస్ జగన్ ముస్లిం మైనారిటీల్లో వెనకబాటుతనాన్ని రూపుమాపాలనే దిశగా నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. ముస్లింలకు వైఎస్సార్ ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లు వారి కుటుంబాలలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చాయని అన్నారు. వైఎస్ జగన్ ముస్లిం మైనారిటీలను శాసన సభ్యులుగా ,శాసన మండలి సభ్యులుగా నామినేటెడ్ పదవుల్లో, స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ప్రస్తుతం అమలు జరుగుతున్న అమ్మఒడితోపాటు షాదితోఫా, విదేశీ విద్య వంటి అనేక పథకాలు ముస్లింలలో పేదరికాన్ని పోగొట్టేవిధంగా ఉన్నాయనడంలో సందేహం లేదన్నారు సజ్జల. ఆ పథకాలు అందుకుంటున్న ప్రతి ఒక్క ముస్లిం మైనారిటీలు తమ వర్గంలో చైతన్యం తీసుకువచ్చే విధంగా పని చేయాలని సూచించారు. దేశంలో ముస్లిం మైనారిటీలకు అత్యంత సురక్షితమైన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అనటంలో అతిశయోక్తి కాదన్నారు. ముస్లిం మైనారిటీల సమస్యలను పార్టీ కేంద్ర కార్యాలయంలో తెలియ చేయాలని సూచించారు.ఇప్పటికే జగన్ ప్రభుత్వం మా నమ్మకం జగన్ పేరుతో పలు కార్యక్రమాలు చేపట్టింది. ఇక మైనార్టీ వర్గాలను దగ్గకు తీసుకునేందుకు మరో భారీ కార్యక్రమాన్ని నిర్వహించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అందులో భాగంగానే విజయవాడ లేదా కడప కేంద్రంగా మైనార్టీ వర్గాల సమావేశానికి ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే ఎస్సీ వర్గాలతో పార్టీ పరంగా సమావేశానికి ప్లాన్ చేస్తున్నారు. ఇలా ఎన్నికల నాటికి అన్ని వర్గాలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. మైనార్టిలను డిప్యూటీ సీఎంగా చేసి బాధ్యతలు అప్పగించిన ఘనత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా అన్నారు. మైనార్టీలతో నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలు వైఎస్సార్‌సీపీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా ఉండాలని నిశ్చయించుకోవడం శుభపరిణామం అన్నారు.దేశంలో ఎక్కడా లేని విధంగా మైనారిటీల భద్రతకు, సంక్షేమానికి, వారి ఉన్నతికి అనేక నిర్ణయాలు తీసుకోవడమే కాక వాటిని అమలు చేస్తున్న ఘనత జగన్‌దేనని అంజాద్ బాషా అన్నారు. రాజశేఖరరెడ్డి ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లు ముస్లిం మైనారిటీ కుటుంబాలలో ఏ విధంగా వెలుగులు నింపాయో జగన్ తీసుకుంటున్న నిర్ణయాలు అన్ని రంగాల్లో అభివృద్ధికి దోహదం చేస్తున్నాయని చెప్పారు. ముస్లింలకు ప్రభుత్వం ఏమీ చేయడం లేదంటూ ఇటీవల కాలంలో టిడిపి నేతలు, చంద్రబాబు, లోకేష్ అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వాటిని ముస్లింలందరూ తిప్పికొట్టాలన్నారు. చంద్రబాబు హయాంలో ముస్లింలపై చేసిన అరాచకాలు తమను గాయపరిచాయన్నారు అంజాద్ బాషా. వాటిని ముస్లింల ఎవ్వరూ మరిచిపోలేదన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190